ప్రజాశక్తి
శుక్రవారం 14 ఏప్రిల్ 2023
12 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉక్కుపై హైడ్రామా

ప్రైవేటీకరణపై కేంద్ర మంత్రి కులస్థే ఉదయం, సాయంత్రం వేర్వేరు ప్రకటనలు

పోరాటాన్ని ఆపేది లేదు : ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, సీతమ్మధార

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై గురువారం హైడ్రామా నెలకొంది. 'ప్రైవేటీకరణపై ముందుకెళ్లడం లేదు' అని ఉదయం ప్రకటించిన కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఫగన్ సింగ్ కులస్థే సాయంత్రానికి మాట మార్చేశారు. 'అంతా నా చేతిలో ఏమీ లేదు. ఢిల్లీలో నేను మాట్లాడతాను. మీరు చేసిన ప్రతిపాదనలు తెలియజేస్తాను. మోడీ సారథ్యంలోని ప్రభుత్వం చూసుకుంటుంది' అని తేల్చిచెప్పారు. కొద్ది గంటల వ్యవధిలోనే ఆయన మాటల్లో మార్పు కనిపించడం బిజెపి అసలు నైజాన్ని తెలియజేసింది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వ నయవంచన మరోసారి ప్రస్ఫుటమైంది.

ఉదయం ఇలా..

గురువారం ఉదయం విశాఖ పోర్టు కళావాణి స్టేడియంలో జరిగిన రోజ్‌గార్ మేళాలో పాల్గొనేందుకు ముఖ్య అతిథిగా ఫగన్ సింగ్ కులస్థే విచ్చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 195 మందికి కేంద్ర ప్రభుత్వ సర్వీసులకు సంబంధించి ఉద్యోగ నియామక మిగతా 2లో..

నాటకాలు ఆపి స్పష్టమైన ప్రకటన చేయాలి : సిపిఎం, సిఐటియు

ప్రజలను వంచించడం ఆపి వైజాగ్ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపి వేస్తున్నట్లు కేంద్ర మంత్రివర్గం వెంటనే ప్రకటన చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. గురువారం ఉక్కు సహాయ మంత్రి కొద్ది గంటల వ్యవధిలోనే వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై మాట మార్చడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను లాభాల్లోకి తీసుకురండి, ప్రైవేటీకరణ నిలుపుదల అంశం అప్పుడు చూద్దాం అని మంత్రి ప్రకటించడం హేయమన్నారు. అసలు స్టీల్‌ప్లాంట్‌ను లాభాల్లోకి రానీయకుండా అడ్డుకుంటున్నది కేంద్ర ప్రభుత్వమేనన్నారు. పూర్తిస్థాయి ఉత్పత్తి జరగనివ్వకుండా కావాలనే ప్లాంట్‌ను ఆర్థికంగా దెబ్బతీస్తున్నారన్నారు. బ్లాస్ట్‌ఫర్నేస్‌ను మూసివేశారని, ముడిసరుకు, వర్కింగ్ కేపిటల్ ఇవ్వడం మిగతా 2లో..

నేటి నుంచి సిపిఎం, సిపిఐ ప్రచార భేరి

వార్త 9లో..

పోడు పట్టాలకు సన్నద్ధం

వార్త 10లో..

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసమూర్తి

యుపిఎస్‌సి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ

ఈ నెల 16న జిల్లాలోయుపిఎస్‌సి నిర్వహించబోతున్న పోటీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో యుపిఎస్‌సి పరీక్షలకు సంబంధించి నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ ఎగ్జామినేషన్ (1), కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ (1) - 2023 పరీక్షలు జరుగనున్నాయని తెలిపారు. ఈ పరీక్షలకు 6442 మంది అభ్యర్థులు జిల్లాలో హాజరుకానున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు, రూట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు కోవిడ్ నిబంధనలు, యుపిఎస్‌సి గైడ్‌లైన్స్ తుచా తప్పకుండా పాటించాలని ఆదేశించారు. సమావేశంలో యుపిఎస్‌సి అధికారులు, జివిఎంసి, పోలీస్, మెడికల్, ఇపిడిసిఎల్ అధికారులు పాల్గొన్నారు.

రామానాయుడు స్టూడియోపై జగన్ కన్ను

మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖపట్నంలోని రామానాయుడు స్టూడియోపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కన్ను పడిందని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కాముల్లో ముఖ్యమంత్రి జగన్ ఆరితేరిపోయారని విమర్శించారు. విశాఖపట్నంలో రామానాయుడు స్టూడియోకు చంద్రబాబు ప్రభుత్వం ఎకరా రూ.20 లక్షలు చొప్పున 54 ఎకరాలను ఇచ్చిందని, రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దానిని అడ్డుకోవాలని చూసినా ఆ ప్రయత్నం సఫలీకృతం కాలేదని అన్నారు. సిఎంగా జగన్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఉక్కుపై హైడ్రామా

పత్రాలు అందజేశారు. అనంతరం కొంత మంది విలేకరులు ఆయన్ని వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ బిడ్డింగ్‌లో త్వరలో పాల్గొననుందన్న ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై ప్రస్తుతానికి ముందుకు వెళ్లడం లేదని తెలిపారు. ప్లాంట్‌ను బలోపేతం చేసే పనిలో ఉన్నామని అన్నారు. తొలుత అర్ఐఎన్ఎల్ యాజమాన్యం, కార్మిక సంఘాలతో చర్చిస్తామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం బిడ్డింగ్‌లో పాల్గొనడం ఒక ఎత్తుగడ మాత్రమేనని విమర్శించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో ముందుకు వెళ్లడం లేదన్న మంత్రి ప్రకటనతో తెలుగు రాష్ట్రాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

సాయంత్రం ఇలా..

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలతో నోవటెల్ హోటల్‌లో మంత్రి పగన్ సింగ్ కులస్థే సమావేశమయ్యారు. 32 మంది ప్రాణ త్యాగాల ఫలితంగా ఏర్పడిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయొద్దని నేతలు కోరారు. కేంద్ర ప్రభుత్వమే స్టీల్‌ప్లాంట్‌కు కావాల్సిన ముడి సరుకులను సరఫరా చేయాలన్నారు. సొంత గనులు కేటాయించాలని కోరారు. ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడిపి, నిర్వాసితులందరికీ శాశ్వత ఉపాధి కల్పించాలన్నారు. దీనికి మంత్రి స్పందిస్తూ 'అంతా నా చేతిలో ఏమీ లేదు. ఢిల్లీలో నేను మాట్లాడతాను. మీరు చేసిన ప్రతిపాదనలు తెలియజేస్తాను. మోడీ సారథ్యంలోని ప్రభుత్వం చూసుకుంటుంది' అని అన్నారు. మంత్రితో భేటీ అనంతరం పోరాట కమిటీ నేతలు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని స్పష్టమైన ప్రకటన కేంద్రం నుంచి వచ్చే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నామని తెలిపారు.

నాటకాలు ఆపి స్పష్టమైన ప్రకటన చేయాలి : సిపిఎం, సిఐటియు

లేదని, రైల్వే రేక్స్‌ను అడ్డుకుంటున్నారని, సొంతగనులు ఇవ్వడం లేదని తెలిపారు. అటువంటప్పుడు లాభాలు ఎక్కడ నుండి వస్తాయని ప్రశ్నించారు. ఇటీవల పార్లమెంట్‌లో ఎంపీలు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై వెనుక్కి తగ్గేది లేదని, ప్రైవేటీకరణ ప్రక్రియ సాగుతుందని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. బిజెపి నాటకాలు ఆడుతోందని మండిపడ్డారు. గురువారం కేంద్ర మంత్రి ప్రకటనలు ఉదయానికీ, సాయంత్రానికీ మారిపోయాయని తెలిపారు. ఈ ప్రకటనలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. కేంద్రం ఇటీవల ఇఒఐ పేరుతో ప్రవేటీకరణకు మరో తెరలేపిందని తెలిపారు. నేడు కేంద్రమంత్రి ప్రకటనలు ప్రజలను మరోసారి వంచించే ఎత్తుగడగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పుడు మరలా ఎన్నికలు దగ్గరపడుతుండంతో కార్మికుల్లో గందరగోళం సృష్టించి ఎన్నికల్లో లబ్ధిపొందాలని ప్రయత్నిస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం చేయాలనుకోవడం లేదనే మాట నిజమే అయితే కేంద్ర ప్రభుత్వం గతంలో వేసిన ట్రాన్సక్షన్స్ అడ్వయిజరీ, లీగల్ అడ్వయిజరీ, ఆస్తుల మదింపుల కమిటీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రబోదిలో వున్న కోల్‌మైన్స్‌ను అర్ధాంతరంగా రద్దు చేసి ప్రైవేట్‌వారికి ఎందుకు అప్పగించినట్టని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకమని ప్రగల్భాలు పలుకుతూనే వాడచీపురుపల్లిలో ఉన్న శాండ్‌మైన్స్‌ను రద్దు చేసిందన్నారు. ఇలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్టీల్‌ప్లాంట్‌ను అదానీకి, అంబానీకి కట్టబెటాలని ప్రయత్నిస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కార్మికుల్లో పెరుగుతున్న అసంతృప్తిని, ఆగ్రహాన్ని పక్కదారి పట్టించేందుకే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇటువంటి కపటనాటకాలు ఆడుతోందని తెలిపారు. ఉక్కు ప్రైవేటీకరణ నిలిపివేస్తున్నట్టు స్పష్టమైన ప్రకటన చేయాలని వేరొక ప్రకటనలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, పబ్లిక్ సెక్టార్ కో - ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు డిమాండ్ చేశారు.

రామానాయుడు స్టూడియోపై జగన్ కన్ను

అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రామానాయుడు స్టూడియో స్థలంపై ఆయన కన్ను పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ స్థలంలో 17 ఎకరాలకు జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు పేరిట పవర్ ఆఫ్ అటార్నీ ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. రామానాయుడు కుమారుడు, స్టూడియో అధినేత దగ్గుబాటి సురేష్ స్థలాన్ని జివిఎంసి కమిషనర్‌కు మార్ట్‌గేజ్‌కు ఎలా ఇస్తారని బండారు ప్రశ్నించారు. అసలు దీని ఆంతర్యం ఏంటో తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్టూడియో ప్రమోషన్‌కు ఇచ్చిన స్థలానికి లే అవుట్ ఎలా వేస్తారన్నారు. ఆ స్టూడియో స్థలాన్ని సొంతం చేసుకునేందుకు రెండేళ్లుగా వైసిపి నేతలు ప్రయత్నిస్తున్నారన్నారు. బదిలీపై వెళ్లిపోతున్న కమిషనర్ సదరు పత్రాలపై ఎలా సంతకం పెట్టారని, ఈ నెల 10న ఏ విధంగా రిజిస్ట్రేషన్ జరిపించారని నిలదీశారు. ఇప్పటికే మధురవాడ సబ్ రిజిస్ట్రార్‌కు స్థల హక్కుదారు సురేష్ బాబు లే అవుట్ పత్రాలు అందజేశారని గుర్తు చేశారు. గత కమిషనర్ రాజాబాబుకు బహుమతిగా జగన్ ప్రభుత్వం కలెక్టర్‌గా ప్రమోషన్ ఇచ్చిందన్నారు. జగన్ చేస్తున్న స్కాముల్లో ఇదో పెద్ద స్కాం అని ఆరోపించారు. ఈ వ్యవహారంపై టిడిపి న్యాయ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. వైసిపి నేతలు అందరినీ బెదిరిస్తూ విశాఖలో విలువైన స్థలాలు లాక్కుంటున్నారని మండిపడ్డారు. ఈ విధంగా స్కాంలు చేస్తూ దేశంలో గొప్ప పేదవానిగా జగన్ పేరు తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు.

బిజెపి హయాంలో..

దళితులు, మైనారిటీలపై పెరిగిన దాడులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, మైనారిటీలపై దాడులు పెరిగాయని కెవిపిఎస్ విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి వేడుకల్లో భాగంగా గురువారం ఎం.సుబ్బారావు అధ్యక్షతన ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో కార్యక్రమం చేపట్టారు. తొలుత ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ బిజెపి వచ్చిన తర్వాత దళితులు, మైనారిటీలపై దాడులు విపరీతంగా పెరిగాయని, అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని పూర్తిగా నిర్మూలన చేసి మనువాద రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టారన్నారు. భారతదేశపు అభివృద్ధిని వందల ఏళ్ల వెనక్కి పంపించేందుకు ఆర్ఎస్ఎస్ ద్వారా కుట్ర జరుగుతోందన్నారు. అట్రాసిటీ కేసులను నిర్వీర్యం చేసి, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వేరే కార్యక్రమాలకు మళ్లించి చట్టాలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులు తీయట్లేదని, దళితులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని అన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి.అప్పలరాజు మాట్లాడుతూ త్రివర్ణ పతాకాన్ని అంగీకరించని ఆర్ఎస్ఎస్ విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం దేశద్రోహమని అన్నారు. సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి

అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న కెవిపిఎస్ నేతలు

కెవిపి.చంద్రమౌళి మాట్లాడుతూ దళితులు పోలీస్‌స్టేషన్‌కు వెళితే వారి గోడు వినిపించుకునే నాథుడు కూడా కొన్నిచోట్ల లేకుండాపోయారన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కర్రి గణేష్, ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల సంఘం అధ్యక్షులు కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అంబేద్కర్ జయంతి సందర్భంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మద్దిలపాలెం పిఠాపురం కాలనీలో గురువారం మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని డివైఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి వి.కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, సంతోష్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని, అది కల్పించే హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. యువత కోసం పోరాటాలే కాకుండా సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు సతీష్, రఘురాజా, తులసి, లక్ష్మణ్, దివాకర్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

దర్శకుడు ప్రభాకర్‌కు సత్కారం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖలో ప్రతిభగల కళాకారులకు కొదవలేదని కళింగ వైశ్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు అన్నారు. సినీ దర్శకులు ఆరిపాక ప్రభాకర్ విశాఖ జర్నలిజం రంగం నుంచి ఎదిగి కర్ణాటక రాష్ట్రంలో ఉత్తమ దర్శకునిగా అవార్డు పొందిన సందర్భంగా గురువారం సనారా, చందు ఆర్ట్స్ మూవీస్ ఆధ్వర్యంలో విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆరిపాక ప్రభాకర్ విశాఖలోనే జర్నలిస్టుగా పనిచేసి, హైదరాబాదులో సినీ దర్శకుడుగా మారి తొలి చిత్రంతోనే కర్ణాటకలో బెస్ట్ డైరెక్టర్ అవార్డు తీసుకోవడం అభినందనీయమని చెప్పారు. ఆయన మరిన్ని మంచి చిత్రాలు రూపొందించి, అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, సీనియర్ జర్నలిస్టు ఎన్.నాగేశ్వరరావు, విజెఎఫ్ కార్యదర్శి దాడి రవికుమార్, ఉపాధ్యక్షులు నాగరాజ్ పట్నాయక్ పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి ఆక్వా స్పోర్ట్స్ ఈత కొలను

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మే 15కు బీచ్ రోడ్డులోని జివిఎంసి ఆక్వా స్పోర్ట్స్ ఈత కొలను అందుబాటులోకి వస్తుందని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి స్పష్టం చేశారు. కరోనా విపత్కర పరిస్థితుల తరువాత చాలా కాలంగా ఈత ప్రియులు, క్రీడాకారులకు దూరంగా ఉన్న ఈ కాంప్లెక్సును గురువారం ఆమె జివిఎంసి ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్ తదితరులతో కలసి సందర్శించారు. ఈత కొలనుకు మరమ్మతులు చేపట్టి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అందుకోసం సిరామిక్ టైల్స్ కోసం రూ.19.20 లక్షలతో అంచనా వేశారు. న్యూ ఇన్‌లెట్, అవుట్ లెట్ పైప్‌లతో పాటు మరిన్ని మరమ్మతుల కోసం రూ.9.60 లక్షలు, పాతవి తీసేసి కొత్త వాటిని అమర్చేందుకు రూ.17.60 లక్షలు, పెయింటింగ్‌తో పాటు ఫిల్టర్లు మార్చేందుకు మరో రూ.18.65 లక్షలు వెరసి సుమారు రూ.65 లక్షలతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఈ నెలాఖరుకే పనులు పూర్తి చేయాలన్నారు.

IN THE HONOURABLE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL CLAIM XII ADDITIONAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM
M.V.O.P. 28 / 2022

Between:
Malla Chinni Sridev . . . Petitioner
And:
1. Gonthina Samba Murthy
2. Gonthina Radha Krishna
3. Bajaj Alianz General Insurance Com., Ltd., Rep by its Branch Manager, VIP Road, Visakhapatnam. . . . Respondents

Notice to Respondents 1 and 2
1. Gonthina Samba Murthy, S/o. G.Peda Ramulu, Hindu, aged 50 years, Residing at Chinna Bheemavaram, Butchayyapeta Mandal, R.Bheemavaram Mallam, Visakhapatnam - 531036.
2. Gonthina Radha Krishna, S/o. G.Samba Murthy, Hindu, aged 27 years, Caste by Kapu Residing at Chinna Bheemavaram, Butchayyapeta Mandal, R.Bheemavaram Mallam, Visakhapatnam - 531036.

It is to inform to both of you that the Hon'bel Court ordered notice to both of you in the above matter for your appearance on 02-05-2023 by way of substitute service in Prajasakti Newspaper on or before 14-04-2023 in which you are hereby directed by the Hon'ble Court to appear before the court on 02-05-2023 in the morning by 10-30 A.M. either in person o through any advocate counsel to represent on your behalf to answer the queries posted by th Hon'ble Court.
Hence, this notice

Visakhapatnam.
Dt. 13-04-2023

GOLAGANA APPARAO
ADVOCATES.
Visakhapatnam.
Cell : 9490132232, 7780725888

BEFORE THE HONOURABLE 1ST ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE AT VIZIANAGARAM
O.S.42/2019

Between :
Prabhala Venkata Surya Subrahamanya Rama Mallikharjuna Rao ..Plaintiff
And
Boggaram Venkata Srinivas ..Defendant

To
Boggaram Venkata Srinivas
S/o Narayana Rao
D.No.50-121-53/22, Flat No.21.
Balayya Sastry Lay out,
Sitammadhara, Visakhapatnam.

Take notice that the above suit filed against you for specific performance and the same is posted to 27-04-2023 for your appearance, in person or through an Advocate failing which the matter will be decided in your absence.

Date : 12-04-2023
Vizianagaram.

I.SURESH
Advocate
Vizianagaram.

మట్టి నమూనాల ద్వారా అధిక దిగుబడి

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : మట్టి నమూనాల సేకరణ, పరీక్షల ఆధారంగా వినియోగించే ఎరువుల వాడకం వల్ల పంట అధిక దిగుబడి వస్తుందని స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ బొడ్డేపల్లి విజయ ప్రసాద్ స్పష్టం చేశారు. మండలంలోని మజ్జివలస రైతు భరోసా కేంద్రంలో గురువారం వ్యవసాయ శాఖ మండల, గ్రామ స్థాయి వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు మట్టి నమూనాల సేకరణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయప్రసాద్ మాట్లాడుతూ, భూసార సేకరణ, పరీక్ష కార్యక్రమాలు గత మూడేళ్లుగా జరగలేదని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం మట్టి నమూనాల సేకరణ, పరీక్షలను నిర్వహించి, ఫలితాల ఆధారంగా రైతులు సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భూసారం బాగుంటేనే పంటల సాగు, దిగుబడి బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి మన్మధరావు, జిల్లా వనరుల కేంద్రం శిక్షణా అధికారి చదువుల సుబ్రహ్మణ్యం, జిల్లా భూసార పరీక్షా విభాగం ఎడిఎ శ్రీదేవి, మండల వ్యవసాయ శాఖ అధికారి బి.శివకోమలి తదితరులు పాల్గొన్నారు.

కోరాడలో శిక్షణ

పద్మనాభం : మండలంలోని కోరాడ రైతు భరోసా కేంద్రంలో మట్టి నమూనాలపై వ్యవసాయ శాఖాధికారులు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మండల ఇన్‌ఛార్జి వ్యవసాయాధికారి బి.శశికళ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉత్తుర్వుల ప్రకారం ఈ సీజన్ నుంచి మట్టి నమూనాలు సేకరించి, వాటి ఫలితాలు ఆధారంగా సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటించేటట్లు చేయాలని సూచించారు. మట్టి నమూనాలను ఎలా సేకరించాలి, భూసార పరీక్షలు అనుసరించి ఎరువులు వాడకాన్ని తగ్గించడం, నాణ్యమైన అధిక దిగుబడులు సాధించడంపై వివరించారు. ప్రతి రైతూ భూసార పరీక్షలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమములో భీమిలి ఎడిఎ బి.విజయప్రసాద్, ఉద్యానశాఖ అధికారి మన్మధరావు, జిల్లా శిక్షాణాధికారి సిహెచ్ సుబ్రహ్మణ్యం, జిల్లా భూసార పరీక్ష ఎడిఎ దేవి తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం మడలం కోరాడలో శిక్షణా కార్యక్రమం

త్యాగాలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జలియన్ వాలా బాగ్ దుర్ఘటనలో అమరులైన భారతీయుల త్యాగాలు వెలకట్టలేని వని స్థానిక ప్రభుత్వ డైట్ వైస్ ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్ అన్నారు. ప్రభుత్వ డైట్‌లో గురువారం జలియన్ వాలాబాగ్ దుర్ఘటన సంస్మరణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనరల్ రెజినాల్డ్ డయ్యార్ దురాగతానికి పరాకాష్టగా 1919 ఏప్రిల్ 13న జలియన్ వాలాబాగ్ ఘటనలో అమాయక ప్రజలను, పిల్లలను, మహిళలను కిరాతకంగా హతమార్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జి.రవి, నాగేశ్వరరావు, సోమయాజులు, షేక్ అల్లా ఉద్దీన్, పి.హరిణి తదితరులు పాల్గొన్నారు.

నవోదయ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు పరిధి బంగ్లా మెట్ట ప్రాథమిక పాఠశాలలో గురువారం 30మంది విద్యార్థులకు నవోదయ పరీక్ష మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. సాయి సంహిత ఫౌండేషన్ ఆధ్వర్యాన సుమారు రూ 15వేలు విలువ గల మెటీరియల్‌ను ఎంఇఒ కెఎ.బాలామణి ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు రెడ్డిపల్లి అప్పలరాజు, పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్లు పంపిణీచేస్తున్న సర్పంచ్ తదితరులు

గ్యాస్ కనెక్షన్ల ఉచిత పంపిణీ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గొట్టిపల్లి గ్రామంలో ప్రధానమంత్రి ఉజ్వల్ గ్యాస్ ఉచిత కనెక్షన్లను సర్పంచ్ గంటా జగదీశ్వరరావు, బిజెపి కిసాన్ మోర్చా ఉత్తరాంధ్ర జోన్ సోషల్ మీడియా కన్వీనర్ పివివి.ప్రసాదరావు పట్నాయక్, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆనందపురం మండల ప్రజలు ఈ పథకాన్ని ఎక్కువ మంది ఉపయోగించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బుత్తల రాజు, గ్రామ పెద్దలు బుత్తల రమణ, కోరాడ రాము, డిపి.రాజు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నవజాత శిశువుకు అరుదైన చికిత్స

చికిత్స అనంతరం శిశువును తల్లిదండ్రులకు అప్పగిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : 27 వారాల గర్భధారణతో జన్మించిన 750 గ్రాముల నవ జాత శిశువుకు అపోలో ఆసుపత్రిలో అరుదైన చికిత్స అందించి ప్రాణం పోశారు. దీనికి సంబంధించి అపోలో వైద్యుల కథనం ప్రకారం... ఎల్ఎస్‌సి ద్వారా జన్మనిచ్చిన శిశువుకు శ్వాస కోస సమస్య ఏర్పడింది. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం విశాఖ అపోలో ఆసుపత్రి డాక్టర్ ఫజాలను సంప్రదించారు. డాక్టర్ ఫజాల, డాక్టర్ సతీష్ పర్యవేక్షణలో బేబీని నియోనెటల్ ఐసియూలో ఉంచి చికిత్స అందించారు. ప్రీమెచ్యూర్ జననంతో ఆస్టియోహినియా, నియోనెటెల్ కామెర్లు, నియోనెటల్ సెప్సిస్, రక్తహీనత తదితర సమస్యలు బేబీలో కనిపించాయి. చికిత్స అనంతరం బేబీ క్రమంగా మెరుగు పడి ఫీడింగ్ తట్టుకుంది. ప్రస్తుతం నాలుగు నెలల శిశువు 2.2 కిలోల బరువుతో క్షేమంగా డిశ్చార్జ్ అయింది. ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్యులకు పాప తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

చందనోత్సవం సేవలపై సమావేశం

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం కొడపై ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న చందనోత్సవం రోజున భక్తులకు సేవలందించేందుకు ముందుకు వచ్చిన స్వచ్ఛంద సేవా సంఘాలతో గురువారం నృసింహ సదన్ వద్ద దేవస్థానం ఈవో వి.త్రినాధరావు సమావేశం నిర్వహించారు. కొండమీద సేవలు నిర్వహించే స్వచ్ఛంద సేవా సంఘాల వారికి పాసులు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌కుమార్, వై.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి-యంత్రాంగం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతిని గురువారం పలుచోట్ల కెవిపిఎస్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు.

భీమునిపట్నం : కెవిపిఎస్ ఆధ్వర్యాన స్థానిక ఎఎంసి యార్డు ఎదురుగా ఉన్న అంబేద్కర్ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భాగం లక్ష్మి, దళిత సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర నాయకులు భాగం గోపాలరావు, మాజీ కౌన్సిలర్ జివి.రమణ తదితరులు పాల్గొన్నారు

కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న కెవిపిఎస్, సిఐటియు ఐద్వా నాయకులు

భీమిలిలో నివాళులర్పిస్తున్న దళిత సంఘం నాయకులు

కొవ్వొత్తులతో నివాళి

పిఎం.పాలెం : కొమ్మాదిలో గురువారం కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. అంబేద్కర్‌కు నివాళులర్పిస్తూ నినాదాలు చేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ, కుల రహిత సమాజం కోసం అంబేద్కర్ పాటుపడ్డారని కొనియాడారు. కానీ మన దేశం, రాష్ట్రంలో నేటి పాలకులు కుల తత్వాన్ని పెంచి పోషించడమే కాకుండా అంతరాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. సమాజంలో సంపద ప్రజలందరికీ సమానంగా అందాలని అంబేద్కర్ చెబుతుంటే బిజెపి ప్రభుత్వం మాత్రం ఆదానీ, అంబానీకు దోచి పెడుతోందని విమర్శించారు. సామాన్య ప్రజలపై తీవ్ర భారాలు వేస్తున్న పాలకులపై అంబేద్కర్ చూపించిన బాటలో నడిచి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు సియాద్రి పైడితల్లి, కె.నాగరాజు, జి.కిరణ్, ఎం.ఆదిలక్ష్మి, కె.పుష్ప, సిఐటియు నాయకులు డి.కొండమ్మ, పి.రాజ్‌కుమార్, డి.అప్పలరాజు, ఐద్వా నాయకులు బి.భారతి, కె.సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం ఆశిపాలెం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... భీమిలి మండలం, చిప్పాడ పంచాయతీ, సిటీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నగిరెడ్ల రమేష్ (40) వేరొక వ్యక్తికి చెందిన ఆటోలో మందుల కోసం వెళ్తున్నాడు. ఆశిపాలెం వద్ద అకస్మాత్తుగా కుక్క అడ్డంగా రావడంతో ఆటోను షడన్‌గా ఎడమ వైపు తిప్పడంతో బోల్తా పడింది. ఆటో కింద పడిన డ్రైవర్ రమేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. రమేష్‌ను సంగివలస ఎఎన్‌హెచ్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సిఐ కె.లక్ష్మణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్ : కాలువలో జారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని జంపపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. యలమంచిలి రూరల్ పోలీసుల కథనం ప్రకారం... .జంపపాలెం గ్రామానికి చెందిన గలగా అప్పారావు (47) గురువారం మధ్యాహ్నం పొలంలో పని చేసుకొని శారద నది ఒడ్డుకు వెళ్లి కాళ్లు చేతులు కడుక్కుంటూ ప్రమాదవశాత్తు కాలువలో జారి కాలువలో పడిపోయాడు. అప్పారావుకు ఈత రాకపోవడంతో మునిగిపోయి మృతి చెందాడు. ఈ ప్రమాదంపై అప్పారావు భార్య యలమంచిలి రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై కె.సన్ని బాబు తెలిపారు.

కారు బోల్తా

ప్రజాశక్తి -మధురవాడ : గీతం కాలేజీ మీదుగా ఎండాడ జాతీయ రహదారికి వెళ్లే రోడ్డులో గురువారం కారు బోల్తా పడింది. ఇందులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. వారు సమీపంలో ఉన్న గీతం ఆసుపత్రికి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని మద్ది జంక్షన్‌లో బుధవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న 40 బస్తాల 40 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సిఐ సన్యాసినాయుడు గురువారం తెలిపారు. పద్మనాభం క్రైమ్ ఎస్ఐ ఆర్ మల్లీశ్వరరావు లోడుతో వెళు న్న వాహనాన్ని పట్టుకొని పద్మనాభం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఈ రేషన్ బియ్యం విశాఖపట్నం పూర్ణమార్కెట్ నుంచి మద్ది ఇటుక బట్టిలో పనిచేస్తున్న కార్మికులకు సరఫరా చేస్తున్నారని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సచివాలయంలో ఎంపిడిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ ఎం.విజయకుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రికార్డులు నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఇఒఆర్‌డి ఎం.ఉషారాణి తదితరులు ఉన్నారు.

రామాలయంలో స్టీల్ గేట్లు ఏర్పాటు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో రామాలయానికి ఎంపిపి కె.రాంబాబు తన సొంత నిధులు రూ.57 వేలతో స్టీల్ గేట్లు వేయించారు. తన తండ్రి కీర్తిశేషులు కంటుబోతు సత్యం జ్ఞాపకార్థం వీటిని ఏర్పాటుచేసినట్లు ఎంపిపి తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న హీరో శ్రీకాంత్

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను సినీ హీరో శ్రీకాంత్ గురువారం దర్శించుకున్నారు. అతనికి ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. శ్రీకాంత్ ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

కరాటే అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీహరి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎపి కరాటే అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా జివిఎంసి నాలుగో వార్డుకు చెందిన వాసుపల్లి శ్రీహరి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రతాప్‌కుమార్ తెలిపారు. శ్రీహరిని ప్రతాప్‌కుమార్, అసోసియేషన్ ప్రతినిధి సాయి, రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ బాలు అభినందించారు.

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి -మలగాడ : జివిఎంసి 59వ వార్డు పరిధి హనుమాన్‌నగర్‌లో నిర్మించిన సిసి రోడ్లు, కాలువలను పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి అధ్యక్షులు పుర్రె సురేష్, వార్డు ఇన్‌ఛార్జి రేవల్లు సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ కృష్ణ (ఆల్ఫా), సీనియర్ నాయకులు అంగా రాంప్రసాద్, సోషల్ మీడియా కో-కన్వీనర్లు స్పందన బాబూరావు, టి.సంపత్‌కుమార్, హనుమాన్‌నగర్ టెంపుల్ ధర్మకర్త ఆర్.ప్రసాద్, స్థానిక నాయకులు ఎల్ల సత్యనారాయణ, కోరాడ శ్రీను, అమరావతి, కాకి గౌరీ పాల్గొన్నారు.

గీతం ఉచిత న్యాయ సహాయం

ప్రజాశక్తి-మధురవాడ : అట్టడుగు వర్గాల ప్రజలకు అండగా నిలిచి న్యాయపరమైన సహాయ సహకారాలు అందించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటి సంయుక్తంగా స్థానిక తిమ్మాపురం పరిసర ప్రాంతాలలో గురువారం ఇంటింటికి తిరుగుతూ ఉచిత న్యాయ సహాయాన్ని అందించారు. గీతం న్యాయ కళాశాల విద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యులతో పాటు జిల్లా న్యాయ స్థానం నుంచి సబ్ జడ్జి బుల్లికృష్ణ పాల్గొని చేపల తిమ్మాపురం గ్రామస్తుల సమస్యలనడిగి తెలుసుకున్నారు. న్యాయ పరమైన అంశాలలో ప్రజలకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటి ఏ విధంగా సహాయ పడుతుందో తెలియజేశారు. ఈ ప్రాంత వాసులకు ప్రతి శుక్రవారమూ గీతం న్యాయ కళాశాల ఆధ్వర్యాన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని స్కూల్ ఆఫ్ లా డైరెక్టర్ ప్రొఫెసర్ అనితారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కౌశల్ మహోత్సవం

ప్రజాశక్తి -కంచరపాలెం : యువతకు విదేశీ ఉపాధిని కల్పిస్తున్న జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇంటర్నేషనల్ అండ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిర్వహిస్తున్న భారతదేశం యొక్క మొదటి అంతర్జాతీయ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని ఓల్డ్ ఐటిఐ ప్రిన్సిపల్ జె.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ, జాతీయ ప్రముఖ యజమానులు ఈ ఎంపికను నిర్వహించే జాబ్ మేళాలో పాల్గొనడానికి ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి, ఐటిఐ, డిప్లమో, బీటెక్, ఎంబిబిఎస్, నర్సింగ్, ఇంటర్, ఏదైనా ఉన్నత విద్యార్హత కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు క్యుఆర్ కోడ్‌ని స్కాన్ చేయడం ద్వారా లేదా https://kaushal mahotsav.nsdcdigital.org/international/candidate లింకు ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9988853335 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రగడ చెన్నారావు, రామ్మోహన్, మానస

పంచవటి హౌస్ ఓనర్స్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -గాజువాక : పంచవటి హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ గురువారం ఎన్నికైంది. అధ్యక్షులుగా ప్రగడ చిన్నారావు, కార్యదర్శిగా రామ్మోహన్, జాయింట్ సెక్రెటరీగా ఆర్.శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా నీలం మానస, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నారాయణ, దాడి శ్రీనివాసరావు, సత్యనారాయణరెడ్డి, కృష్ణకుమారి ఎన్నికయ్యారు.

మధురవాడ బిల్డర్స్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి -పిఎం పాలెం : మధురవాడ బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా మాతృశ్రీ బిల్డర్స్ అధినేత పోతిన శివ, చైర్మన్‌గా జగదభిరామ్ కన్‌స్ట్రక్షన్ అధినేత నక్క శ్రీధర్, కార్యదర్శిగా ఆకుల శ్రీనివాస్, కోశాధికారిగా కెంబూరి రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా కుమార్, వెంకటరావు, రామకృష్ణ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మహిళల స్వయం ఉపాధికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ కృషి

ప్రజాశక్తి-సీతమ్మధార : మహిళల్లో మానసిక చైతన్యాన్ని పెంపొందించేందుకు వివిధ వృత్తి కళలను నేర్పించి స్వయం ఉపాధిని కల్పించడంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ముందంజలో ఉందని ప్రధాన మోటివేటర్ టి.అరుణకుమారి తెలిపారు. దొండపర్తిలోని నిరంజన్ మెడిటేషన్ సెంటర్‌లో గురువారం చర్మ, శిరోజాల సంరక్షణపై మహిళలకు అవగాహన కల్పిస్తూ ప్రముఖ బ్యూటీషియన్ శోభారాణిచే ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 50 మంది ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణ కుమారి మాట్లాడుతూ, తాము ఉచిత కుట్టు శిక్షణ, వివిధ చేతివృత్తుల్లో మహిళలకు శిక్షణ, మహిళా సాధికారత, బాలిక సంరక్షణ వంటి అనేక అంశాలపై ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాలను భారత్ నిధి సంస్థ వ్యవస్థాపకులు ప్రముఖ చార్టెడ్ అకౌంట్ డబ్బీరు గోపికృష్ణ తగు రీతిన ప్రోత్సహిస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శారద వల్లి, పలువురు విద్యార్థులు, మెడిటేషన్, యోగా టీచర్లు పాల్గొని ఆరోగ్య రహస్యాలు, చిట్కాలు తెలిపారు.

'ఆర్ఇసిఎస్‌లో రూ.700 కోట్ల కుంభకోణం'

ప్రజాశక్తి-సీతమ్మధార: అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలోని ఆర్ఇసిఎస్‌లో రూ.700 కోట్ల భారీ కుంభకోణం జరిగినట్లు అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ జనసేన అధికార ప్రతినిధి దూలం గోపీనాథ్ ఆరోపించారు. గురువారం పౌర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏపీ ఈపీడీసీఎల్ నెలవారీ లెక్కలతో వివరాలు బహిర్గతం అయ్యాయని స్పష్టం చేశారు. గత సంవత్సరం తిరిగి ఆర్ఇసిఎస్‌కు లైసెన్స్ మంజూరు చేయాలన్న లేఖకు ఫూటుగా స్పందిస్తూ ఆర్ఇసిఎస్ అవినీతిని బహిర్గతం చేస్తూ కమిషన్ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి 33 పేజీల రిపోర్ట్ చేశారని తెలిపారు. ఐటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ద్వారా మరలా ఆర్ఇసిఎస్‌కు లైసెన్స్ వచ్చేలా వైసిపి ప్రభుత్వం పావులు కదుపుతుందని ఆరోపించారు. ఈపిడిసిఎల్, ఆర్ఇసిఎస్ పని తీరులో, కలెక్షన్స్, ఖర్చులో భారీ వ్యత్యాసం ఉన్నట్లు ఆయన వెల్లడించారు. అక్రమంగా గతంలో 79 మందిని, వైసిపి ప్రభుత్వంలో 13 మందికి పర్మినెంట్ ఉద్యోగాలు వేయించారని, నిబంధనలను ఎమ్‌డి పాటించలేదని, ఉద్యోగానికి లక్షల్లో వసూళ్లు చేశారని ఆరోపించారు. ఇందులోని 15 ఏళ్ల ఆర్థిక లావాదేవీలు, నియామకాలు, పనితీరుపై జ్యుడీషియల్ లేదా సిబిఐ విచారణ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో జన సైనికులు రాందాస్, గోవిందరావు, తాడి రామకష్ణ, మళ్ల శ్రీను, తాకసి సత్యం దొర, అప్పికొండ గణేష్, గంగుపాం జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

స్టిక్కర్లను అంటిస్తున్న కాయల వెంకటరెడ్డి తదితరులు

14వ వార్డులో 'జగనన్నే మా భవిష్యత్'

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 14వ వార్డులో కార్పొరేటర్ అనీల్‌కుమార్‌రాజు ఆధ్వర్యాన గురువారం 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్టిక్కర్లను అతికించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులదరికీ అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్రి మురళీకృష్ణారెడ్డి, బల్ల శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణరాయబారం పద్యనాటకం

ప్రజాశక్తి -మాధవధార : విశాఖపట్నం పోర్టు ఆర్థిక సహాయంతో శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు సీతారామ కల్యాణ మండపంలో శ్రీకృష్ణ రాయబారం పద్య నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి విశాఖపట్నం పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దుబే, బిసిహెచ్ మసేన్, దాడి సత్యనారాయణ, హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రముఖ రంగస్థల నటుడు ఎస్‌కె.మిశ్రోను సన్మానించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పోర్టు, డిఎల్‌బి ఉద్యోగులు, పెన్షనర్లు,

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పెన్షనర్లు

కళాకారులు, కళాభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

46వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డు పరిధి శాంతినగర్ కైలాసపురం, శాంతినగర్ కొండవాలు ప్రాంతంలో గురువారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రజా ప్రతినిధులే గడప గడపకూ వెళ్లి ప్రజలను కలుసుకొని సమస్యలనడిగి తెలుసుకొని పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనీల్‌కుమార్‌రాజు, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ రాజు, 48వ వార్డు ఇన్‌ఛార్జి నీలరవి, డైరెక్టర్ రాయుడు, వాలంటీర్లు పాల్గొన్నారు.

15న జాబ్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : విశాఖపట్నంలోని ప్రముఖ సంస్థలలో వివిధ పోస్టుల భర్తీకి కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 15న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సిహెచ్ సుబ్బిరెడ్డి (క్రీడల) ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బిఐ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ సంస్థలో బ్రాంచ్ మేనేజర్, సేల్స్ మేనేజర్ ఉద్యోగాలు 25 ఖాళీలకు 21 నుంచి 45 సంవత్సరాలు వయస్సు, ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. వీరికి నెలకు రూ.20 వేల నుంచి రూ.35 వేలు జీతం ఉంటుందని తెలిపారు. ముత్తూట్ ఫిన్ కార్పొరేట్ లిమిటెడ్ సంస్థలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు 35 ఖాళీలకు ఏదైనా డిగ్రీ, పీజీ, అర్హతతో 21 నుంచి 32 సంవత్సరాల వయసు గల అభ్యర్థులు అర్హులని, వీరికి నెలకు రూ.16 వేలు జీతం ఉంటుందని తెలిపారు. స్మార్ట్ సర్వీసెస్ సంస్థలో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాలు 150 ఖాళీలకు పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ అర్హతతో 34 సంవత్సరాల లోపు గల అభ్యర్థులు అర్హులని, వీరికి నెలకు రూ.21,500 జీతం ఉంటుందని పేర్కొన్నారు. కాలిబర్ సపోర్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో బ్రాంచ్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు 40 ఖాళీలకు ఏదైనా డిగ్రీ అర్హతతో 30 ఏళ్ల వయస్సు గలవారు అర్హులని, వీరికి నెలకు రూ.15 వేలు జీతం ఉంటుందని తెలిపారు. మహవీర్ గ్రూప్ స్కోడా సంస్థలో సేల్స్ కన్సల్టెంట్స్ అండ్ టీం లీడర్స్ ఉద్యోగాలు 8 ఖాళీలకు ఏదైనా డిగ్రీతో 18 నుంచి 35 సంవత్సరాల మధ్య గల వారు అర్హులని, వీరికి నెలకు రూ.18 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం ఉంటుందని పేర్కొన్నారు. అర్హత ఆసక్తి కలిగిన అభ్యర్థులు ముందుగా ncs.gov.in వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకొని, అర్హత గల ధ్రువపత్రాలతో ఆ రోజు హాజరు కావాలని కోరారు.

అనధికార నిర్మాణం తొలగింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : జీవిఎంసి జోన్ 3 పరిధి 16వ వార్డులో అనధికారికంగా వేసిన 3వ అంతస్తును తొలగించినట్లు టిపిఎస్ తేజ పేర్కొన్నారు. అనధికారికంగా నిర్మాణాలు చేపడితే తొలగిస్తామని హెచ్చరించారు. బిల్డింగ్ నిర్మాణదారులు ప్లాన్ ప్రకారం నిర్మించుకోవాలని సూచించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సెక్రెటరీ, సిబ్బంది పాల్గొన్నారు.

కుర్చీల వితరణ

ప్రజాశక్తి - ములగాడ : జీవిఎంసి 63వ వార్డు పరిధి కాకరలోవ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు, చాపలను వి సి ఎల్ ఉద్యోగి పి.వెంకటరమణ, సతీమణి అరుణ అందించారు. పి.వెంకటరమణ దంపతులకు అంగన్‌వాడీ కార్యకర్త భవాని వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి విశాఖపట్నం జిల్లా ప్రధాన కార్యదర్శి గుడాల రాంబాబు, సిద్దార్థ, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బల్లలు అందజేత

ప్రజాశక్తి- ములగాడ : జీవిఎంసి 63వ వార్డు పరిధి చింతలలోవ గ్రామంలోని మరిడిమాంబ ఆలయానికి వచ్చిన భక్తులు కూర్చోవడానికి అనుకూలంగా మూడు సిమ్మెంట్ బల్లలను 61వ టిడిపి వార్డు ప్రెసిడెంట్ మజ్జి సోమేష్ గురువారం అందించారు. మజ్జి సోమేష్‌కు ఆలయధర్మకర్త జెర్రిపోతుల నరసింహారావు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.96 లక్షలకు 'టెండర్'!

- జరిగిపోయిన పనులకు జి 20 పేరిట గోల్‌మాల్
- కనికట్టు చేస్తున్న జివిఎంసి కమిషనర్
- జనసేన కార్పొరేటర్లు మూర్తియాదవ్, నాగరాజు

మాట్లాడుతున్న జనసేన కార్పొరేటర్లు మూర్తియాదవ్, నాగరాజు

ప్రజాశక్తి- కలెక్టరేట్ : జీ-20 సదస్సు జరిగిపోయిన చాన్నాళ్ల తర్వాత, దాని పేరుతో జివిఎంసి కమిషనర్ రాజాబాబు టెండర్లు పిలవడం అవినీతికి పరాకాష్ట అని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మీడియా సమావేశంలో మాట్లాడుతూ. జీ20 సదస్సు పేరుతో రూ.కోట్ల జివిఎంసి, ప్రజాధనాన్ని కమిషనర్, మేయర్, షాడో మేయర్లు దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. దీనిప మొదటి నుంచి జనసేన తగు ఆధారాలతో వెలుగులోకి అంశాల వారీగా తీసుకొచ్చిందన్నారు. జీ20 జరిగిన తర్వాత కమిషనర్ రాజాబాబుకు బదిలీ ఆర్డర్ వచ్చిందని, అయితే పాత తేదీలతో జీ-20 పనులకు ఇప్పుడు టెండర్లు పిలవడం విడ్డూరంగా ఉందన్నారు. పిఎల్‌ఎస్‌కి సంబంధించి నాలుగు, హార్టికల్చర్‌కు సంబంధించి ఐదు, మొత్తంగా తొమ్మిది టెండర్లను ఈ నెల 10న పిలిచి 13న టెండర్ క్లోజింగ్ డేట్ ప్రకటించారన్నారు. అయిపోయిన పనులకు ఇప్పుడు టెండర్లు పిలవడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికే వీరికి కావలసిన అనుచరులు పనులు చేపట్టగా, కొన్ని చేపట్టలేదన్నారు. తొమ్మిది టెండర్ల విలువ రూ.96 లక్షలని, ఈ టెండర్లు ఏ కాంట్రాక్టర్లకు వస్తాయో తాము చెప్పగలమన్నారు. బినామీలతో పనులు చేపట్టి రూ.కోట్లు కొట్టారనడానికి ఇదే నిదర్శనమన్నారు. హార్టికల్చర్‌లో టెండర్లు ప్రకాష్ అనే వ్యక్తికి, పిఎల్‌ఎన్‌పిలో రవీంద్రనాథ్ అనే వ్యక్తికి కట్ట బెట్టారన్నారు. జనసేన కార్పొరేటర్ కందుల నాగరాజు మాట్లాడుతూ 98 వార్డుల్లో అభివద్ధి చేయకుండా, జి-20 పేరుతో ఒక దగ్గరే పనులు చేపట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నాయకులు శ్రీనివాస పట్నాయక్, తెలుగు అర్జున్, బంటు రవి, గౌరీ నాయుడు పాల్గొన్నారు.

విశాఖపట్నం, గాంధీధామ్ ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బి కోచ్‌లు

ఎల్‌హెచ్‌బి కోచ్‌లను ప్రారంభిస్తున్న ఎంపీ, డిఆర్‌ఎం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రయాణీకులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించే లక్ష్యంతో 20803 విశాఖపట్నం- గాంధీధామ్ ఎక్స్‌ప్రెస్‌కు గురువారం నుంచి నూతన ఆధునిక జర్మన్ టెక్నాలజీ లింక్ హాఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బి) ర్యాక్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే డివిజనల్ మేనేజర్ అనూప్ శతపతి అన్నారు. గురువారం కొత్త ఎల్‌హెచ్‌బి ర్యాకులను ఏర్పాటు చేసిన రైలును స్థానిక ఎంపి ఎంవివి సత్యనారాయణతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఎం అనూప్ శతపతి మాట్లాడుతూ, వాల్తేరు డివిజన్ పరిధిలో 21వ రైలును ఎల్‌హెచ్‌బి రేక్‌గా మార్చడంతోపాటు మొత్తం 31ర్యాక్‌లను ఏర్పాటు చేశామన్నారు. విశాఖ ఎంపి ఎంవివి.సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖపట్నంలో ఎల్‌హెచ్‌బి రేక్స్ పరిచయంతోపాటు రూ.450 కోట్లతో స్టేషన్ అభివృద్ధి, వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు తదితర సౌకర్యాలను స్టేషన్లలో మెరుగుపరిచామన్నారు.
దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రూ. 600 కోట్ల కంటే ఎక్కువ విలువైన మూడు ముఖ్యమైన పనులను విశాఖపట్నం ప్రాంత అభివద్ధికి డిఆర్‌ఎం మంజూరు చేసారని అభినందించారు. కార్యక్రమంలో ఎడిఆర్‌ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ పాల్గొన్నారు. 20803 విశాఖపట్నం- గాంధీధామ్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13 నుంచి, 20804 గాంధీధామ్- విశాఖపట్నం వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 16నుంచి ఎల్‌హెచ్‌బి కోచ్‌లతో నడుస్తుందని వెల్లడించారు.

నేటి నుంచి ప్లాస్టిక్ ప్యాకేజింగ్, ప్రింటింగ్ ఎక్స్‌పో

ప్రజాశక్తి- పిఎం పాలెం : పిఎం.పాలెం వి.కన్వెన్షన్ సెంటర్ వేదికగా ప్లాస్టిక్స్, ప్యాకేజింగ్, ప్రింటింగ్ ఎక్స్‌పో తన రెండవ ఎడిషన్‌ను ఈ నెల 14నుంచి మూడు రోజులు పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జిఎస్.అనీల్‌కుమార్ తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో విశాఖ నుంచి కొత్త తరహ మార్కెట్‌ను పరిచయం చేయనున్నామన్నారు. అంతర్జాతీయ వాణిజ్య ఉత్సవాలు, వివిధ పరిశ్రమల ఆధారిత సమావేశాలు అనుభవంతో కూడిన బృందలతో సెమినార్‌లను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ధనుష్ ఎకో ప్రొడక్ట్స్ అధ్యక్షులు నిర్మల్ పురుషోత్తం పాల్గొన్నారు.

విజనగిరిపాలెం రోడ్డుకు మోక్షం

ప్రజాశక్తి-సింహాచలం: ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని విజనగిరిపాలెం రోడ్డు ఎట్టకేలకు మోక్షం లభించింది. జివిఎంసి 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం చొరవతో అధికారులు సుమారు రూ.32 లక్షలతో గురువారం రోడ్డు పనులను ప్రారంభించారు. కార్పొరేటర్ పీవీ.నరసింహులు ఈ పనులను పర్యవేక్షించారు. గతుకుల రోడ్డును బాగుచేయడంతో స్థానికులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

దువ్వాడలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ నూతన శాఖ

బ్యాంక్ నూతన శాఖ ప్రారంభిస్తున్న స్టీల్ డైరెక్టర్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : పంజాబ్ నేషనల్ బ్యాంక్ 129వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా, దువ్వాడలో ఆ బ్యాంకు నూతన శాఖను ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్) వివి. వేణుగోపాలరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిఎం వి.నీలిమ, చీఫ్ మేనేజర్ భిక్షపతి, ఎల్.అప్పలరాజు, ఎజిఎం బి. అనిల్‌కుమార్, బ్రాంచ్ మేనేజర్ ఇతర సిబ్బంది వినియోగదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిఎం వి.నీలిమ మాట్లాడుతూ కస్టమర్ల్శ,చ శ్రేయోభిలాషులకు బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వినియోగదారుల ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు తెలుపుతూ, ముమ్ముందు ఇలాగే కొనసాగించాలని ఆకాంక్షించారు. విశాఖపట్నం సర్కిల్ పరిధిలో దువ్వాడ నూతన 66వ శాఖ అన్నారు ప్రస్తుత మార్కెట్లో తక్కువ వడ్డీ రేట్లతో ఎంఎస్ఎంఇ రుణాలు, రిటైల్ రుణాలు, ఎస్‌హెచ్‌జి రుణాలు, గోల్డ్ లోన్లు, కార్ లోన్లు అర్హులకు అందించడానికి కొత్తశాఖ ప్రారంభించామన్నారు. బ్యాంకు సిబ్బందిని ముఖ్యఅతిథి వేణుగోపాలరావు అభినందించారు.

భానుడు భగభగ..!

- రారెత్తిస్తున్న ఎండలతో జనం బెంబేలు
- వడగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- 40 డిగ్రీల సెంటీగ్రేడ్ దాటేసిన ఉష్ణోగ్రతలు
- ఉదయం పదిగంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యం

ప్రచండ భానుడి భగభగలతోపాటు వేసవి వడగాలులు, ఉక్కబోతతో జనం ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. ఎనిమిదేళ్ల తర్వాత ఏప్రిల్ నెలలో ఈస్థాయి ఉష్ణోగ్రతలు, వడగాలులు నమోదు కాలేదని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఉపరితల ద్రోణులు, ఆవర్తనాలతోపాటు సముద్రపు గాలులు బలంగా లేకపోవడంతో పడమర గాలులు బలంగా వీస్తూ, ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో విశాఖ నగరంతోపాటు గ్రామీణ ప్రాంతాలు, మన్యంలోనూ రికార్డుస్థాయిలో 43డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతను దాటేలా ఎండలు మండుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇంటిగోడలు, వస్తువులతో సహా దేన్ని పట్టుకున్నా వేడెక్కి చుర్రుమనిపిస్తున్నాయి. ఉదయం పదిగంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తుండగా, తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చే ప్రజలు, విద్యార్థులు ఎండ దెబ్బకు వడలిపోతున్నారు. వేసవి నుంచి ఉపశమనానికి కర్బూజా, కొబ్బరిబోండాలు, చెరకు, పళ్లరసాలు, మజ్జిగను ఆశ్రయిస్తున్నారు.

వేసవి తాపానికి కర్బూజాలతో ఉపశమనం పొందుతున్న జనం

మండుటెండలకు వీధుల్లో జనాలు లేక బోసిపోయిన బోండాల వ్యాపారం

ఎండ దెబ్బకు మంచినీళ్లతో సేదదీరుతున్న కానిస్టేబుల్

పండ్ల జ్యూస్‌లతో వేసవితాపం తీర్చుకుంటున్న విద్యార్థినులు

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
శుక్రవారం 14 ఏప్రిల్ 2023

బడుగుల ఆశాజ్యోతి బాబాసాహెబ్ అంబేద్కర్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్. ఈ పేరు వింటే చాలు ఓ రకమైన ఉత్తేజం. స్ఫూర్తి. ఆయన పేరు తలచుకుంటే తెలియని ఉత్సాహం. కలబడి నిలబడాలన్న తెగువ. ఇంతలా అందరినీ ప్రభావితం చేసిన అంబేద్కర్.. భారతదేశ రాజ్యాంగ నిర్మాత... న్యాయ నిపుణుడు... రాజకీయ నాయకుడు... ఆర్థికవేత్త... మంచి ఉపాధ్యాయుడు... గొప్ప ఉపన్యాసకుడు... ప్రముఖ సంపాదకుడు... ప్రసిద్ధ రచయిత... వెరసి బహుముఖ ప్రజ్ఞాశాలి. స్వయంకృషి, స్వీయ ప్రతిభతో ఎంతో ఎత్తుకెదిగిన మహావ్యక్తి. అంటరానితనం, కులతత్వం, సామాజిక, ఆర్థిక రాజకీయ, సాంస్కృతిక అసమానతలు రూపుమాపడానికి తన జీవితాంతం పోరాడిన యోధుడు. సమాజాన్ని మౌలికంగా పరిశీలించి, సమస్యలకు పరిష్కారాలు సూచించిన మేధావి. అందుకే ఆయన అణగారిన వర్గాల ఆశా జ్యోతి... యావజ్జాతికి వైతాళికుడు.

మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా అంబవాడ గ్రామంలో రాంజీ మాలోజీ సక్పాల్, భీమాబాయి దంపతులకు 1891 ఏప్రిల్ 14న అంబేద్కర్ జన్మించారు. కుటుంబం అనేక కష్టాల్లో ఉన్నప్పుడు అంబేద్కర్ ప్రాథమిక విద్య ప్రారంభమైంది. 1900లో సతారాలోని ప్రభుత్వ పాఠశాలలో చేరారు. పసితనం నుంచే ఆయనకు ఎన్నో కష్టాలు, హింస ఎదురయ్యాయి. దళిత కులంలో పుట్టిన కారణంగా నలుగురికీ దూరంగా, అందరితో మాట్లాడడానికి తగనివాడిగా వెలివేయబడ్డారు. అస్పృశ్యత, సామాజిక అగౌరవం చవిచూశారు. బాల్యంలోనే ఇవన్నీ అంబేద్కర్‌పై చెరగని ముద్రవేశాయి. ఆరేళ్ల వయసులోనే తల్లిని కోల్పోయి మానసికంగా నిస్సహాయుల య్యారు.

అంబేద్కర్ అసలు పేరు భీమ్‌రావ్ రాంజీ అంబవడేకర్. సొంతూరులో 'అంబవడె' అని పిలిపించుకోవడానికి ఇష్టపడడంతో భీమ్‌రావ్ రాంజీ అంబవడే అనే పేరు నిలిచింది. సతార పాఠశాలలో అంబేడ్కర్ పేరుతో ఉపాధ్యాయుడు ఉండేవారు. ఆ ఉపాధ్యాయునిపై ఇష్టం ఉండడంతో ఆయన పేరుని 'అంబవడి అంబేడ్కర్'గా అందరికీ చెప్పేవాడు. తెలుగులో అంబేద్కర్ పేరు పలకడం తేలికగా ఉండడంతో అంబేడ్కర్ పేరు కాస్తాఅంబేద్కర్‌గా మారింది.

వివక్షను చూవిచూసి..

మాధ్యమిక విద్యాభ్యాసం స్థాయికి చేరేసరికి హిందూ జాతిలోని సంకుచితత్వాన్ని అంబేద్కర్ తెలుసుకున్నారు. వర్ణ వ్యవస్థ అనే సంకెళ్లలో మనుషులెలా బందీలుగా మారిందీ తెలుసుకున్నారు. అగ్రవర్ణాలతో కలిసి నిమ్నజాతుల పిల్లలు కూర్చొనేందుకు వీలులేదు. ఓరోజున అంబేద్కర్ తన సోదరితో కలిసి పక్క గ్రామానికి వెళ్లారు. దాహం వేయడంతో మంచినీళ్ల డిగారు. దళితు లని తెలియడంతో అక్కడి వారు నీళ్లిచ్చేందుకు నిరాకరించారు. అంతేకాదు. మురికి గుంటలో నీళ్ల తాగండి అంటూ కోపంతో ఊగి పోయారు. ఇంటికి పోయేందుకు ఎడ్ల బండి ఎక్కగా, కులం పేరు తెలియ గానే ఆ బండాయన కాళ్లతో కిందకు నెట్టేసి పొమ్మ న్నాడు. అగ్రవర్ణాల విద్యార్థులు పాఠశాలల్లో బెంచీలపై కూర్చొంటే దళిత విద్యార్థులు కటిక నేలపై కూర్చోవాల్సి వచ్చేది. చాలామంది విద్యార్థులు అంబేద్కర్ పుస్తకాలు కూడా ముట్టుకునేవారు కాదు. క్లాస్ రూంలో ఓసారి ఎవరూ చేయలేని లెక్క తాను చేస్తానంటూ బ్లాక్‌బోర్డు వద్దకు అంబేద్కర్ వెళ్తుండగా విద్యార్థులు పెద్దపెట్టున గోల చేశారు. 'ఆ వెనుక భోజనాలున్నాయి, వాటికి మైలు తగులుతుంది' అంటూ కేకలు వేశారు. ఇలా చిన్నతనం లోనే అంబేద్కర్‌కు అనేక అవమానాలు ఎదురయ్యాయి.

1907లో అంబేద్కర్ మెట్రిక్యులేషన్ పరీక్షల్లో పాసయ్యారు. నిమ్న కులస్తులలో ఇదే పెద్దవిశేషం అప్పట్లో. 14వ ఏట చదువుకుంటుండగానే అంబేద్కర్‌కు రమాబాయి అనే తొమ్మిదేళ్ల బాలికతో వివాహమైంది. పెళ్లి తరువాత ఎలిఫిన్‌స్టన్ కళాశాలలో ప్రవేశించి 1912లో బిఎ పాసయ్యారు. ఆ తరువాత బరోడా సంస్థాన రక్షణ శాఖలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన ఉద్యోగంలో చేరిన కొద్దికాలానికే తండ్రి చనిపోయారు. ఉన్నత చదువుకోసం విదేశాలకు వెళ్లడానికి బరోడా మహారాజు ప్రకటించిన ఉపకారవేతనం అంబేద్కర్‌కు లభించింది.

1913 జులైలో అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో చేరారు. అంటరాని జాతికి చెందిన విద్యార్థి విదేశీ విశ్వవిద్యాలయంలో చదివే అవకాశం కలగడం దేశ చరిత్రలో అప్పట్లో ఇదే అపూర్వమైన సంఘటన. నిరాడంబర జీవితం గడుపుతూ రాజనీతి శాస్త్రంలో ఎంఎను 1915లో పూర్తిచేశారు. ప్రాచీన భారత వాణిజ్యం అనే అంశంపై రచనలు చేశారు. భారతదేశంలో కులాలు, వాటి పనితీరు, పుట్టుక, అభివృద్ధి అనే పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. అనంతరం అమెరికాలో పిహెచ్‌డి పొందారు. ఆ తరువాత పైచదువు కోసం లండన్ వెళ్లాలనుకున్నారు. అదే సమయంలో జాతీయోద్యమ నేత లాలా లజపతిరాయ్ స్వాతంత్ర్య పోరాటంలోకి రావాలని అంబేద్కర్‌ను ప్రోత్సహించారు. దానికి సమయముందంటూ అంబేద్కర్ లండన్ వెళ్లారు.

అస్పృశ్యతపై పరిశోధనలు, రచనలు

అంబేద్కర్‌లో కలిగిన దృఢసంకల్పం అతన్ని హిందూ మతాన్ని కూలంకుషంగా పరిశీలించేలా చేసింది. హిందూ మతం ఆధునిక విజ్ఞాన ఫలితాలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం భావాలకు ఎలా వ్యతిరేకమైందో నిరూపించాలను కున్నారు. 'అస్పృశ్యులెవరు? కులనిర్మూలన, గాంధీ, కాంగ్రెస్ అస్పృశ్యులకేం చేశారు?' అనే ప్రసిద్ధ రచనలు చేశారు.

అధ్యాపకుడిగానూ అంబేద్కర్‌కు అవమానాలే

ముంబాయి కళాశాలలో ఆర్థిక శాస్త్రం ప్రొఫెసర్‌గా అంబేద్కర్ 1918 నవంబరులో చేరారు. అక్కడ కూడా కూజాల్లోని నీరును అగ్రకులానికి చెందినవారు అంబేద్కర్‌ను తాగనిచ్చేవారు కాదు. దళితుడు కావడంతో అక్కడా అనేక అవమానాలు ఎదుర్కొన్నారు.



దళితుల ప్రగతికి కృషి

దళితుల ప్రగతికి అంబేద్కర్ ఎనలేని కృషి చేశారు. దళిత జాతిలో స్వయంశక్తి కల్పించేందుకు, ఆత్మవిశ్వాసం పెంచేందుకు పలు కార్యక్రమాలు చేపట్టారు. ఆచరణాత్మకమైన ధైర్యంతో అగ్రవర్ణాల దయాదాక్షిణ్యాలను తిప్పికొట్టారు. 1920 మే నెలలో నాగపూర్‌లో అఖిల భారత నిమ్నకులాల మహాసభ తొలిసారిగా ఆయన ఏర్పాటు చేశారు. నిమ్న జాతులు ఎదుర్కొంటున్న సమస్యలపై బహిరంగ సభలో గళమెత్తారు. నిమ్నజాతులను, వెనుకబడిన కులాల కార్మికులను సంఘటితం చేసి, వారి సమస్యలు పరిష్కరించేందుకు 'బహిష్కార భారత్' అనే పత్రికను అంబేద్కర్ 1927 స్థాపించారు. 1927లో మహర్ సత్యాగ్రహ ఉద్యమాన్ని చేశారు. 1928లో ముంబయిలో టెక్స్‌టైల్ కార్మికులు చేసిన సమ్మెను సమర్థిస్తూ స్వయంగా ఉద్యమంలో పాల్గొన్నారు.

గాంధీ, అంబేద్కర్ మధ్య భేదాభిప్రాయాలు, పూనా ఒప్పందం

1919 మాంటేగ్ చేమ్స్ ఫర్డ్ సంస్కరణలు భారతదేశంలో ఎలా పనిచేస్తున్నాయో అధ్యయనం చేయడానికి, నూతన రాజ్యాంగ సంస్కరణల కోసం సూచించేందుకు ఏర్పాటు చేసిన సైమన్ కమిషన్ భారతదేశంలో 1928లో పర్యటించింది. ఆ పర్యటన అనంతరం ఆ కమిటీ బ్రిటిష్ ప్రభుత్వానికి అందించిన నివేదికను చర్చించడానికి బ్రిటిష్ ప్రభుత్వం మూడు రౌండ్ టేబుల్ సమావేశాలను ఏర్పాటు చేసింది. ఈ సమావేశాలు 1930, 1931, 1932 సంవత్సరాల్లో జరిగాయి. ఈ మూడు సమావేశాలకు అంబేద్కర్ హాజరు కాగా, రెండో సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్ తరపున గాంధీ హాజరయ్యారు. ఈ సమావేశంలోనే గాంధీకి అంబేద్కర్‌కు మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. అంబేద్కర్ దళితులకు ప్రత్యేక నియోజకవర్గాలు ఇవ్వాలని పట్టుబట్టగా, అలా ఇస్తే హిందూ సమాజం విచ్ఛిన్నమవుతుందని గాంధీ ఒప్పుకోలేదు. ఏకాభిప్రాయం కుదరకపోవడంతో రెండో రౌండ్ టేబుల్ సమావేశం నుంచి గాంధీ బయటకు వచ్చేశారు.

1932లో రామ్సే మెక్ డోనాల్డ్ 'కమ్యూనల్ అవార్డు'ను ప్రకటించారు. దీని ప్రకారం దళితులకు ప్రత్యేక నియోజక వర్గాలు ప్రతిపాదించడం జరిగింది. ఈ ప్రకటన వెలువడే నాటికి గాంధీ శాసనోల్లంఘన ఉద్యమంలో భాగంగా అరెస్టయి ఎరవాడ జైలులో ఉన్నాడు. ఈ ప్రకటన గురించి తెలుసుకొని గాంధీ నిరాహారదీక్ష చేపట్టాడు. అంబేద్కర్‌పై నైతిక ఒత్తిడి పెరిగింది. చివరికి గాంధీకి అంబేద్కర్‌కు మధ్య పూనా ఒప్పందం కుదిరి కమ్యూనల్ అవార్డ్ కన్నా ఎక్కువ స్థానాలు నియోజక వర్గాలలో ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది.

రాజ్యాంగ రచన

1947 ఆగస్టు 29న భారత రాజ్యాంగ రచనా సంఘం ఏర్పడింది. ఆ సంఘానికి అంబేద్కర్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. రాజ్యాంగ రచన అంటే ఆషామాషీకాదు. అతిక్లిష్టమైన ప్రక్రియ. ఇటువంటి కీలక సంఘంలో అల్లాడి కృష్ణస్వామి, అయ్యర్ కెఎం మన్షీ, ఎస్ మాధవమీనన్, పిపి ఖైతాన్ వంటి ప్రముఖులు సభ్యులుగా ఎన్నికయ్యారు. రాజ్యాంగ ముసాయిదా 1948 జనవరి నాటికి తయారైంది. 1930-50 భారత రాజకీయాల్లో అంబేద్కర్ ఓ తుపాను. అంటరానితనాన్ని ఎదిరించిన ధైర్యశాలి ఆయన. అటు జాతీయస్థాయి నాయకులపైనా, ఇటు అగ్రవర్ణ హిందువులపైనా ధ్వజమెత్తేవారు. దీంతో, దేశరాజకీయాల్లో అంబేద్కర్‌కు తగిన స్థానం, ప్రాధాన్యత కల్పించలేదని రాజనీతి శాస్త్రజ్ఞులు భావించారు. జీవితాంతం నిమ్నజాతుల కృషికి పనిచేయడంతో ఆ జాతికి చెందిన నాయకుడిగానే గుర్తింపు లభించింది. తరతరాలుగా నిమ్నజాతులు అనుభవిస్తున్న సాంఘిక అస్పృశ్యత అంబేద్కర్‌ను విపరీతంగా కదిలించింది.

1956 డిసెంబరు 2న ఢిల్లీలో జరిగిన దలైలామా గౌరవార్థం ఏర్పాటు చేసిన సభకు అంబేద్కర్ హాజరయ్యారు. తను ఏర్పాటు చేయబోయే కొత్త పార్టీలో చేరాల్సిందిగా డిసెంబర్ 5న పికె.అత్రే, ఎస్ఎం.జోషిలకు ఆహ్వాన లేఖలు రాశారు. అదే రోజు రాత్రి 'బుద్ధ అండ్ హౌస్ ధర్మ' గ్రంథం ఉపోద్ఘాతానికి తుదిమెరుగులు దిద్ది టైప్‌చేసి, తెల్లవారేసరికి తీసుకురావాల్సిందిగా (1956 డిసెంబరు 6 ఉదయానికి) తన ప్రత్యేక కార్యదర్శికి చెప్పారు. తెల్లవారేసరికి అంబేద్కర్ కన్నుమూశారు. సేవలకు గుర్తింపుగా 1990 మార్చి 31న భారతరత్న అవార్డును ప్రభుత్వం ప్రకటించింది.

– ప్రజాశక్తి – విశాఖపట్నం

అంబేద్కర్ ఆశయానికి పాలకుల తూట్లు

బాబాసాహెబ్ ఆలోచనల నుండి పుట్టిన చదువు, పోరాడు, సమీకరించు అనే ఆశయాలు సాధించినప్పుడే అంబేద్కర్ కలలు గన్న సామాజిక న్యాయంతో కూడిన నవ భారత సమాజం ఆవిర్భవిస్తుంది. ఆ ఆశయాలను పూర్తిగా తూర్పార బట్టే విధంగా నేడు పాలకవర్గాలు వ్యవహరిస్తున్నాయి. ఆరేళ్ల నుంచి 14ఏళ్ల లోపు బాల, బాలికలకు ఉచిత నిర్బంధ విద్యా హక్కుకు తూట్లు పొడుస్తూ, ఎన్ఇపి పేరుతో విద్యను వ్యాపారీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అడుగులేస్తోంది.

వీటికి వత్తాసుగా జిఒ117తో 3,4,5 తరగతుల విలీనం పేరుతో మొత్తం ప్రాథమిక విద్యారంగాన్ని, విద్యా వ్యవస్థనే విచ్ఛిన్నం చేసే దిశగా అడుగులేస్తోంది. అంబేద్కర్, ఇతర మహానేతల ఎత్తైన విగ్రహాలు ఆవిష్కరిస్తూ, మరోవైపు అణగారిన ప్రజానీకాన్ని అధఃపాతాళంలోనికి తొక్కేసే నేటి పాలకుల దుశ్చర్యలు బాబాసాహెబ్ ఆశయాలను సాధిస్తున్నాయా? అణిచివేస్తున్నాయా? అనే విషయాన్ని సమాజం గ్రహించాలి.

(అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా...)

టిఆర్. అంబేద్కర్, యుటిఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి

భారతరత్న డా॥ బి.ఆర్. అంబేద్కర్
132వ జయంతి శుభాకాంక్షలు
పుట్టుకతో ఎవ్వరూ గొప్పవారు కాలేరు.. మన ప్రవర్తన, మన చేతలే మనల్ని గొప్పవారిగా మారుస్తాయి.
- డా॥ బి.ఆర్. అంబేద్కర్
శ్రేయోభిలాషి (B.R.S.)

భారతరత్న డా॥ బి.ఆర్. అంబేద్కర్
132వ జయంతి శుభాకాంక్షలు
Dr. N.B.VIJAY KUMAR
M.D(Gen. Med.) M.B.A. (Hosp Admin)
NB CLINIC :
Opp. Sagar Lodge, Collector Office Jn., Vizag-2
Timings : 5 P.M. to 9 P.M.
For Appointment, Ph : 8374506888

భారతరత్న డా॥ బి.ఆర్. అంబేద్కర్
132వ జయంతి శుభాకాంక్షలు
"ఏదైనా ఒక పని చేయాలంటే... మనిషికి సంకల్పం, ఏకాగ్రత ఉండాలి"
డా॥ బి.ఆర్. అంబేద్కర్
నవభారత నిర్మాత, రాజ్యాంగ రచనా సంఘం అధ్యక్షులు
డా॥ బి.ఆర్. అంబేద్కర్ 132వ జయంతి శుభాకాంక్షలు
గుడబండి నాగేశ్వరరావు (GNR)
వై.సి.పి. సీనియర్ నాయకులు
గుడబండి ఆదిలక్ష్మి
మున్సిపల్ చైర్‌పర్సన్, నర్సీపట్నం.
నర్సీపట్నం మండలం, అనకాపల్లి జిల్లా.

భారతరత్న డా॥ బి.ఆర్. అంబేద్కర్
132వ జయంతి శుభాకాంక్షలు
దేశ సంపద ప్రజలందరికీ చెందాలంటే స్టేట్ సోషలిజం మనకు కావాలి.
- డా॥ బి.ఆర్. అంబేద్కర్
భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా॥ బాబా సాహెబ్ అంబేద్కర్ 132వ జయంతి శుభసందర్భంగా మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు
శ్రేయోభిలాషి (B.S.)

భారతరాజ్యాంగ నిర్మాత, భారత రత్న
డా॥ బి.ఆర్. అంబేద్కర్
132వ జయంతి శుభాకాంక్షలు
సకలంలో సరైన చర్య తీసుకుంటే, దాని ఫలితం పదికాలాల పాటు నిలుస్తుంది.
-డా॥బి.ఆర్.అంబేద్కర్
SIDDHARTH AMBEDKAR YELETI
M.H.R.M., LL.B.,
Joint Manager (HR), DCI - Visakhapatnam.

భారతరత్న డా॥ బి.ఆర్. అంబేద్కర్
132వ జయంతి శుభాకాంక్షలు
నీ కోసం జీవిస్తే... నీలోనే నిలిచిపోతావు, జనం కోసం జీవిస్తే... జనంలో నిలిచి పోతావు
- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
S. LAKSHMI BAI
Asst. SECRETARY, GAD
VISAKHAPATNAM PORT AUTHORITY

భారతరత్న డా॥ బి.ఆర్. అంబేద్కర్
132వ జయంతి శుభాకాంక్షలు
మనం ఎంచుకున్న మార్గం వెంట జంకు లేకుండా ముందుకు సాగిపోవాలి.
- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
EAST DIVISION
VISAKHAPATNAM PORT AUTHORITY

భారతరాజ్యాంగ నిర్మాత, భారత రత్న
డా॥ బి.ఆర్. అంబేద్కర్
132వ జయంతి శుభాకాంక్షలు
నీ కోసం జీవిస్తే... నీలోనే నిలిచిపోతావు, జనం కోసం జీవిస్తే... జనంలో నిలిచి పోతావు
- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
Dr. S.SREENIVAS M.D.
Professor of Medicine

భారతరత్న డా॥ బి.ఆర్. అంబేద్కర్
132వ జయంతి శుభాకాంక్షలు
చూడాల్సినది కులం, మతం కాదు. వారి ఆశయం, అభిమతం, ఆశయాలను ఆచరణలో పెడితే మానవుడే మహనీయుడు అవుతాడు.
- డా॥ బి.ఆర్.అంబేద్కర్
శ్రేయోభిలాషి

భారతరత్న బాబాసాహెబ్ డా॥ బి.ఆర్. అంబేద్కర్
132వ జయంతి శుభాకాంక్షలు
"ఏదైనా ఒక పని చేయాలంటే... మనిషికి సంకల్పం, ఏకాగ్రత ఉండాలి"
డా॥ బి.ఆర్. అంబేద్కర్ నవభారత నిర్మాత, రాజ్యాంగ రచనా సంఘం అధ్యక్షులు
డా॥ బి.ఆర్. అంబేద్కర్ 132వ జయంతి శుభాకాంక్షలు
ఆచార్య యం. ప్రసాదరావు
యం.ఏ., పిహెచ్.డి. (సొక్స్)(యు.కె) బి.యల్.,
పూర్వ విభాగాధిపతి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్
విశ్రాంతాచార్యులు, ఆంధ్ర విశ్వ కళాపరిషత్, విశాఖపట్నం - 530003.

16న 'ఎంవిఆర్' ఆధ్వర్యాన మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు ఆర్థిక సహాయంతో ఎంవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 16న పాయకరావుపేట నియోజకవర్గం కోటవురట్ల మండలం, రాజుపేటలో మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా వైద్య శిబిరంలో నర్సీపట్నం, పాయకరావుపేట నియోజకవర్గాలకు చెందిన 20 గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొంటారని పేర్కొన్నారు. విశాఖపట్నం మెడికవర్ ఆసుపత్రి స్పెషలిస్ట్ వైద్య బృందం వైద్య సేవలు అందిస్తుందని తెలిపారు. శిబిరానికి హాజరయ్యే రోగులకు ఉచిత వైద్య పరీక్షలు, మందులు, భోజనం, రవాణా సదుపాయం కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

రూ.కోటితో కల్యాణ మండపాల నిర్మాణం

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ కృషితో అరబిందో కంపెనీ సిఎస్ఆర్ నిధులు కోటి రూపాయలతో మండలంలోని వెంకుపాలెం, బవులవాడ గ్రామాల్లో రెండు కల్యాణ మండపాల నిర్మాణం చేపడుతున్నట్టు మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయా గ్రామాల్లో కల్యాణ మండప స్థలాలను సంబంధిత అధికారులు, అరబిందో కంపెనీ ప్రతినిధులతో పరిశీలించారు. రెండు మూడు రోజుల్లో పనులు ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ధర్మారావు, పంచాయతీరాజ్ డిఇ వేణుగోపాల్, బవులువాడ, వెంకుపాలెం గ్రామాల సర్పంచులు మజ్జి లక్ష్మి, రాపేటి నాగేశ్వరరావు, వైసిపి నాయకులు మజ్జి వెంకట అప్పారావు, ఎంపీటీసీ సభ్యులు రాపేటి వెంకటేశ్వరరావు, ఏఎంసి డైరెక్టర్ దాడి కుమార్, బొద్దపు ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ తల్లి పండగ

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని గొర్లివానిపాలెం గ్రామ పంచాయతీ పరిధి చింతలగొర్లివానిపాలెం, కొత్త గొర్లివానిపాలెం, పాతగొర్లివానిపాలెం గ్రామాల్లో బంగారమ్మ తల్లి పండగ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించారు. సాయంత్రం పురవీధుల్లో తప్పెడిగుల్లు, మేల తారలతో, బాజా బజంత్రీలతో అమ్మ వారిని ఊరేగించి, అనుపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొర్లి గోపి, ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మి ఎరుకు నాయుడు, ఉప సర్పంచ్ గొర్లి రామారావు, పైలా మాధురి, అప్పారావు, రొంగలి నాయుడు, గొర్లి శ్రీనివాస్, గొర్లి శివాజీ, గొర్లి గిరిబాబు, కెవి ప్రసాద్, అనకాపల్లి మోహన్, లాలం రవి, డెక్క రాము, మురళి, పైల రాధాకృష్ణ, అనకాపల్లి శివకుమార్, సిహెచ్ శ్రీను పాల్గొన్నారు.

తాపీమేస్త్రి మృతి

ప్రజాశక్తి-చోడవరం : శ్రీకాకుళం జిల్లాకు చెందిన తాపీమేస్త్రి లక్ష్మీపురం రోడ్డులో ఉన్న ఓ జిమ్ వద్ద గురువారం ఉదయానికి మృతి చెంది ఉన్నాడు. మద్యానికి బానిసైన అతడు నెలరోజుల కిందట చోడవరం వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. తరచూ మద్యం సేవించి తిరుగుతుండేవాడని తోటి కార్మికులు అంటున్నారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సిఐ బి.శ్రీనివాస్ కోరారు.

షిర్డీసాయి ఆలయంలో పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-కె.కోటపాడు : స్థానిక షిరిడి సాయిబాబా మందిరంలో గురువారం మధ్యాహ్నం సుమారు 200 మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ విలేకరి సిలపరిశెట్టి మాణిక్యం భార్య కీర్తిశేషులు నూకరత్నం జ్ఞాపకార్థం బాబా ఆలయంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వేగి రామారావు, కార్యదర్శి యాళ్ళ సాయి, సీనియర్ విలేకరులు సిలపరిశెట్టి వెంకట్రావు, యలమంచిలి ధర్మారావు, కుబిరెడ్డి సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న దృశ్యం

స్టీల్‌ప్లాంట్‌పై మంత్రి ప్రకటనలు అర్థరహితం

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు బాలకృష్ణ

ప్రజాశక్తి- అనకాపల్లి

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై బిజెపి పాలకులకు వత్తాసు పలుకుతూ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన ప్రకటనలు అర్థరహితమని సిపిఎం సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ విమర్శించారు. స్థానిక దొడ్డి రాము నాయుడు భవనంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంత్రి అమర్నాథ్ ప్రకటనలు తమ ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకునేలా ఉన్నాయన్నారు. తమ ప్రకటనలతో ప్రజలను ఎల్లకాలం మోసగించలేరని గుర్తుంచుకోవాలని హితవుపలికారు. అమర్నాథ్ ప్రకటనను తక్షణమే వాటిని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ వత్తాసు పలుకుతూ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. సిపిఐ, సిపిఎంలు చేపట్టిన ప్రచార భేరిలో వీరి బండారాన్ని బయట పెడతామన్నారు. సిపిఎం జిల్లా నాయకులు వివి శ్రీనివాసరావు, అల్లు రాజు, మండల నాయకులు కాళ్ళ తేలయ్య బాబు, నజీర్ మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుకరణకు వ్యతిరేకంగా తమ రాష్ట్రంలోని ప్రభుత్వ సంస్థల ద్వారా బిడ్డు దాఖలు చేస్తామని ప్రకటన చేయడం ప్రైవేటీకరణకు మద్దతు ఇస్తున్నట్టు మంత్రి అమర్నాథ్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ ప్రభుత్వానికి తోడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా రాష్ట్రంలో అన్ని పార్టీలను కలుపుకొని మోడీ ప్రభుత్వంపై ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

పిఎసిఎస్‌ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా
17న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను ప్రైవేటీకరించే చర్యలకు వ్యతిరేకంగా ఈ నెల 17న రాష్ట్రంలో అన్ని కలెక్టరేట్ల వద్ద ఆంధ్రప్రదేశ్ స్టేట్ అగ్రికల్చరల్ కోపరేటివ్ సొసైటీ యూనియన్ (సిఐటియు) పిలుపుమేరకు ధర్నాలను చేపట్టనున్నట్టు యూనియన్ జిల్లా అధ్యక్షులు పి నాగభూషణం తెలిపారు. స్థానిక అన్నపూర్ణ పిఎసిఎస్‌లో గురువారం ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 1964 సహకార చట్టానికి కొత్తగా 115 ఈ నిబంధన చేర్చి ప్రైవేటు వ్యక్తులకు కంపెనీలకు 50 శాతం వాటాలను కట్టబెట్టి వారికి ఓటింగ్ కల్పించడం ద్వారా సహకార సంఘాలు ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతు భరోసా కేంద్రాలను సహకార సంఘాల్లో విలీనం చేస్తూ చేసిన చట్ట సవరణ వల్ల సహకార సంఘాలు ప్రైవేటీకరణకు దారి తీసే ప్రమాదముందన్నారు. అసెంబ్లీ కౌన్సిల్ పాస్ చేసిన వీటిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శివరామకృష్ణ

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

మాట్లాడుతూ ఉద్యోగులకు వేతనాలుకు సంబంధించి వైసిపి ప్రభుత్వం 2020లో జారీ చేసిన 90 జిఒను నేటికీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. నష్టాల్లో ఉన్న సంఘాలను కూడా ఇన్కమ్ టాక్స్ కట్టమని ఆదేశించడంతో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, వాటిని పరిరక్షించుకునేందుకు ఉద్యమ బాట పట్టామని తెలిపారు. ఈనెల 17న జరిగే కలెక్టరేట్ ధర్నాలో పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు మల్ల స్వామి చంద్ర నాయుడు, కోశాధికారి ఓఎస్ ఈశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుల కోసమే నవరత్న పథకాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైసిపి నాయకుల కోసమే నవరత్న పథకాలను అమలు చేస్తున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ విమర్శించారు. మండలంలోని సీతానగరం గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా గురువారం ఉపాధి హామీ కూలీలను కలుసుకొని మాట్లాడారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే వైసిపి తొలగించిన పింఛన్లను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కూలీలకు బిస్కెట్ ప్యాకెట్లు, మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు తెల్లాకుల ప్రకాష్, కాండ్రేగుల రాము, సూరిశెట్టి అప్పలనాయుడు, ముమ్మిన వరహాలు దొర, జగదీష్, మెల్లిపాక రమణ, మోస నూకరాజు, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - యలమంచిలి : మండలంలోని ములకలాపల్లి మైహోం సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో వెంకటేశ్వరస్వామి 11వ బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఫ్యాక్టరీ అధినేత జూపల్లి రామేశ్వరరావు, కుమారి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ విహెచ్. చౌదరి తెలిపారు. యాగశాలలో ద్వారాతోరణ ధ్వజకుంభ ఆరాధన, మహాకుంభ స్థాపన, అగ్ని ప్రతిష్ట, మూలమంత్ర హనన పారాయణాదులు జరిగాయని వివరించారు. శ్రీనివాస కల్యాణోత్సవ సందర్భంగా ఎదుర్కోలు ఉత్సవం, తీర్థప్రసాదగోష్టి జరిగిన కార్యక్రమంలో ఇండస్ట్రీ వైస్ ఛైర్మన్ జూపల్లి వినోద్‌కుమార్, భార్గవి దంపతులు కూడా పాల్గొన్నారు. కార్యక్రమంలో పరిసర గ్రామస్తులతో పాటు ఫ్యాక్టరీ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. శుక్రవారం స్వామి వారి కళ్యాణ మహోత్సవం, అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు అన్నారు. కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం నేటికీ ఆదర్శంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కిరణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న డైట్ విద్యార్థులు

వంటా వార్పు అనంతరం భోజనాలు చేస్తున్న కార్మికులు

రుషిల్ డెకార్ కార్మికుల వంటా వార్పు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లోని రుషిల్ డెకార్ ప్లైవుడ్ కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరికి నిరసనగా గురువారం పరిశ్రమ ఆవరణలో ముఠా కార్మికులు వంటా వార్పు కార్యక్రమంతో నిరసన తెలిపారు. గురువారం ఉదయం వంట పాత్రలు, నిత్యవసర సరుకులు, వంట చెరుకు వంటి సామాగ్రి తెచ్చుకుని వంట చేసుకుని కార్మికులందరూ సహపంక్తి భోజనాలు చేశారు. తమకు న్యాయం చేయాలని తొమ్మిది రోజులుగా ఆందోళన చేస్తున్న ముఠా కార్మికులు కలెక్టరేట్, లేబర్ అధికారి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కార్యాలయాల్లోనూ తమ గోడును విన్నవించుకున్నారు. అయినప్పటికీ యాజమాన్యంలో ఎటువంటి మార్పు కనిపించకపోవడంతో ఆందోళన కొనసాగించారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి భూములు పోగొట్టుకొని కళాసీలుగా, ముఠా కార్మికులుగా పని చేస్తున్న నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సామాన్యులకు న్యాయ సేవను దగ్గర చేసిన జస్టిస్ చిన్నపరెడ్డి

ప్రజాశక్తి-అనకాపల్లి : సుప్రీంకోర్టు, హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పని చేసిన జస్టిస్ ఓ చిన్నపరెడ్డి ఒక న్యాయవాదిగా సామాన్యులకు న్యాయ సేవను దగ్గర చేసి వారి మన్ననలు అందుకున్నారని జన సాహితీ జిల్లా అధ్యక్షులు ఐటిఆర్వి శివాజీరావు తెలిపారు. స్థానిక నరసింగరావుపేట ఏపీటీఎఫ్ భవనంలో గురువారం జరిగిన జస్టిస్ చిన్నపరెడ్డి శత జయంతి సభకు ఆయన అధ్యక్షత వహించారు. ముందుగా చిన్నపరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన సుప్రీం చీఫ్ జస్టిస్‌గా వ్యవహరించిన సమయంలో మైలురాళ్లుగా భావించే అనేక తీర్పులు ప్రకటించారని తెలిపారు. నేటికీ వాటి ప్రాసంగికతను కోల్పోలేదన్నారు. సీనియర్ అడ్వకేట్ పిళ్ల హర శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నపరెడ్డి ప్రజానుకూల కోణంలో అనేక తీర్పులు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది భారతి లక్ష్మి, గౌరీ శంకర్, న్యాయవాదులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యులకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ 84వ వార్డులో ప్రారంభించిన అర్బన్ ఫ్యామిలీ హెల్త్ సెంటరుకు నూతనంగా నియమించిన వైద్యులు శ్రీరామ్, గౌతమను, ఆసుపత్రి సిబ్బందిని స్థానిక నాయకులు గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా వైసిపి పట్టణ కార్యదర్శి కోరుకొండ రాఘవ మాట్లాడుతూ పట్టణ ప్రజలు ఎన్నాళ్లుగానో కలలుగన్న అర్బన్ ఫ్యామిలీ హెల్త్ సెంటర్‌ను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ నిజం చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అప్పికొండ రవి శంకర్, మొగలపల్లి రవి తేజ, సేనాపతి సాయి, కారుకుండి కన్నబాబు, పిన్నింటి కష్ణ, కసిరెడ్డి నాగేష్, పలక నాయుడు, కోరుకొండ వాసు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ప్రగతిపై సమీక్ష

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : జిల్లా నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఈ.సందీప్ గురువారం బుచ్చయ్యపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ప్రగతిపై సిబ్బందితో సమీక్ష చేశారు. జగనన్న భూరక్షలో భాగంగా సర్వే రాళ్ళు పాతడంపై కూడా సమీక్షించారు. ఎంపీడీవో సువర్ణ రాజు, తహసీల్దార్ ఎస్వి అంబేద్కర్, ఏపీడి శ్రీనివాస్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కరకలో జరుగుతున్న సర్వే రాళ్ళు పాతే కార్యక్రమాన్ని పరిశీలించారు.

నేడు జిల్లా హాకీ జట్టు ఎంపిక పోటీలు

ప్రజాశక్తి- యలమంచిలి : యలమంచిలి రాజీవ్ క్రీడా మైదానంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు అనకాపల్లి జిల్లా హాకీ జట్టు ఎంపిక పోటీలు జరగనున్నాయని జిల్లా హాకీ అసోసియేషన్ కో-ఆర్డినేటరు కొఠారు నరేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సీనియర్ మెన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్ 2023 పోటీలు ఈ నెల 21 నుండి సత్యసాయి జిల్లా ధర్మవరం జరగనున్నందున అందుల పాల్గొనే జట్టు ఎంపిక కోసం పోటీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే ఆసక్తి గల క్రీడాకారులు 1994 జనవరి 1 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. పుట్టిన తేదీ ధ్రువపత్రంతో పాటు ఆధార్, 10 తరగతి సర్టిఫికేట్ చూపించాలన్నారు. ఎంపికైన జట్టు ఈ నెల 20న బయల్దేరి 21 నుండి జరిగే టోర్నమెంట్‌లో పాల్గొనవలసి ఉంటుందని పేర్కొన్నారు.

నేటి నుంచి 'ప్రచార భేరి'

పలు చోట్ల పోస్టర్ల ఆవిష్కరణ

అనకాపల్లిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి -యంత్రాంగం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం నుంచి సిపిఎం, సిపిఐ చేపట్టే ప్రచార భేరి కార్యక్రమాల పోస్టర్లను గురువారం పలుచోట్ల ఆవిష్కరించారు.

అనకాపల్లి : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక కర్షక వ్యతిరేక విధానాలకు, మతతత్వానికి నిరసనగా సిపిఎం సిపిఐ సంయుక్తంగా ఈనెల 14 నుంచి 30 వరకు నిర్వహించనున్న ప్రచార భేరి పోస్టర్లను గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఇరు పార్టీల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థ సేవలో మునిగి తేలుతూ, ప్రభుత్వ రంగాన్ని వారికి ధారాదతం చేస్తుందని, సామాన్యులపై విపరీతమైన భారాలు మోపుతుందని తెలిపారు. వాటిపై ప్రజలు ప్రశ్నించకుండా మతం పేరుతో విద్వేషాలను రెచ్చగొడుతుందన్నారు. మరో వైపు రాష్ట్ర విభజన హామీలను తుంగలో తొక్కి రాష్ట్రానికి ద్రోహం చేసిందన్నారు. ఈ విధానాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రచార భేరి నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, జిల్లా నాయకులు వివి శ్రీనివాసరావు, అల్లు రాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, పట్టణ కార్యదర్శి వైఎన్ భద్రం, నాయకులు గొర్లి దేముడు బాబు, వి కన్నబాబు, నరాలశెట్టి సత్యనారాయణ, ఇల్లా రాము, పోతురాజు, సూరిబాబు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో సిపిఎం, సిపిఐ ప్రచార భేరి వాల్ పోస్టర్లను సిపిఎం అచ్యుతాపురం డివిజన్ కన్వీనర్ ఆర్.రాము తదితరులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ అండదండలతో అదాని ఏ విధంగా లక్షల కోట్ల రూపాయలు కొల్లగొట్టాడో హిండేన్ బర్గ్ నివేదిక బట్టబయలు చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తిమ్మరాజుపేట శాఖ కార్యదర్శి ఎస్ రామునాయుడు, నాయకులు బుద్ధ రంగారావు, కె రామసదాశివరావు, కర్రి అప్పలనాయుడు, నూకరాజు, మల్ల నాయుడు పాల్గొన్నారు.

కె.కోటపాడు : 'బిజెపిని సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుకుందాం' అనే నినాదంలో జరుగు ప్రచార భేరి కార్యక్రమం వాల్ పోస్టర్‌ను స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం సిపిఎం, సిపిఐ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు గండి నాయన బాబు, సిపిఐ మండల నాయకులు గొర్రె దేవుడు బాబు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రజల ఉమ్మడి సంపదగా ఉన్న బ్యాంకులను, ప్రభుత్వ రంగ సంస్థలను, అన్నం పెట్టే వ్యవసాయాన్ని మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎర్ర దేవుడు. వనము సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తగరపువలసలో..

తగరపువలస : ప్రచార భేరి కార్యక్రమాలను పోస్టర్‌ను సిపిఎం, సిపిఐ నాయకులు ఆర్ఎస్ఎన్.మూర్తి, అల్లు బాబూరావు గురువారం సిపిఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెరుగుతూనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇరు పార్టీల నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, కానూరు రాంబాబు, అప్పలరాజు, ఎ.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : గాజువాక సిపిఎం కార్యాలయంలో ప్రచార భేరి పోస్టర్‌ను సిపిఎం, సిపిఐ నాయకులు ఎం.రాంబాబు, కసిరెడ్డి సత్యనారాయణ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు వామ పక్ష పార్టీలు ప్రచార ఆందోళన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వామ పక్ష పార్టీల నాయకులు శ్రీనివాసరాజు, బైరెడ్డి గురప్ప, లోకేశ్వరరావు, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, తాండ్ర కనకరాజు, అప్పారి విష్ణుమూర్తి, వై.లక్ష్మణరావు, హాసన్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటలో..

గాజువాకలో...

నినాదాలు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

ఉపాధి హామీ కూలీల నిరసన

ప్రజాశక్తి-పరవాడ

గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసే చర్యలు ఆపాలని, పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ మండలంంలోని వెన్నలపాలెంలో గురువారం సిఐటియు ఆధ్వర్యాన కూలీలు నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం బడ్జెట్లో సంవత్సరానికి రూ.2.40 లక్షల కోట్లు కేటాయించాలని, సంవత్సరానికి ప్రతి కుటుంబానికి 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. రోజుకి రూ.600 రూపాయలు కూలి, సమ్మర్ అలవెన్స్, గుణపాం, పార, తట్టకి, మంచినీటికి పాత పద్ధతుల్లో డబ్బులు చెల్లించాలని, మస్టర్ విధానం పాత పద్ధతుల్లో కొనసాగించాలని, ప్లే షిప్పులు ఇవ్వాలని కోరారు. పని ప్రదేశంలో టెంట్లు మంచినీళ్ల సౌకర్యం, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి రాంబాబు

కాస్పాలో మంచినీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది కస్పాలో మంచినీటి బోరు ఏర్పాటు పనులను జెడ్పిటిసి దొండా రాంబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీటీసీ నిధుల నుండి తాగునీటి బోరును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పంట పొలాలకు వెళ్ళే రైతులకు, ఉపాధి పనుల నిమిత్తం వెళ్తున్న కూలీలకు ఈ తాగునీటి బోరు ఎంతగానో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోఆపరేటివ్ అధ్యక్షులు దొండా సన్యాసిరావు, జిల్లా అగ్రికల్చర్ డైరెక్టర్ గుడాల ఆనంద్ విజయ్ కుమార్, చినప్పనపాలెం సర్పంచ్ కోయిల ఈశ్వరరావు, కెపి అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాస్, వడ్డాది వార్డు సభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సొంత నిధులతో తాగునీటి సౌకర్యం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ఎర్రవాయిలో ప్రసిద్ధి చెందిన రాజాం మరిడిమాంబ గుడి వద్ద ఆ గ్రామానికి చెందిన పూర్వపు ఇంజనీరింగ్ విద్యార్థి గోగుల జనార్ధన్ భక్తుల సౌకర్యార్థం తన సొంత నిధులతో తాగునీటి సదుపాయం ఏర్పాటు చేశారు. రూ.1.5 లక్షలతో మినీ వాటర్ ట్యాంకు, బోరు, ట్యాపులు నిర్మించారు. దీనిని స్థానిక సర్పంచ్ మరిసా నాని గురువారం గ్రామ పెద్దల సమక్షంలో ప్రారంభించారు. జనార్ధన్ ఇప్పటికే గ్రామానికి చెందిన 50 మంది యువకులకు ప్రైవేటుగా ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించారు. ఈ సందర్భంగా జనార్ధనను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మరిసా అప్పల నాయుడు, పెదరమణ, మాజీ ఎంపీటీసీ సతీష్, నరేష్, షేక్ సత్తార్, ఆకుల నాగేశ్వరరావు, సుంకర ప్రసాదు, భాస్కర్ రావు, కర్రి నాయుడు బాబు, కన్నారావు, స్వామినాయుడు ఇందల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ మరిసా నాని

ప్రజలను కలుసుకున్న వైసిపి నాయకులు

గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని అంతకాపల్లి పంచాయతీ పరిధి అంతకాపల్లి, రావలమ్మపాలెం గ్రామాల్లో గురువారం సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మాజీ ఎమ్‌పిపి సబ్బవరపు ముత్యాలనాయుడు ఆధ్వర్యాన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడు బాబు, ఉప సర్పంచ్ గొర్లె అప్పారావు, సచివాలయం కన్వీనర్ గొర్లె నాయుడు, వార్డు సభ్యులు గొంప వరలక్ష్మి, జక్కన శ్రీను, కొల్లి దాసు, సబ్బవరపు శ్రీను పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలో చౌడపల్లి, నిలపర్తి, నరేంద్రపురం, మోసయ్యపేట, మడుతూరు, చీమలపల్లి తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం వైసిపికి చెందిన ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి అంగీకారం మేరకు స్టిక్కర్ అంటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఒడిసల శ్రీనివాసరావు, సర్పంచులు పి.పైడిరాజు, చుక్క అనురాధ, ఎం సంజీవ్, సియాద్రి నాగ నూకరాజు, ఎస్ జువ్వల నాయుడు, మాజీ మండలాధ్యక్షులు చేకూరి శ్రీనివాసరాజు, పి.వాసు పాల్గొన్నారు.

అధికారుల సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి

బాధ్యతలు చేపట్టిన నూతన జెసి జాహ్నవి

ప్రజాశక్తి-అనకాపల్లి

అధికారుల సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం జాహ్నవి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమె జేసీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ రవి పటాన్శెట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. డిఆర్‌ఓ వెంకటరమణ జెసి జాహ్నవిని అభినందించి జిల్లా ప్రొఫైల్‌ను అందజేశారు. అక్కడ పనిచేస్తున్న తహశీల్దార్లు, ఇతర సిబ్బంది వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. జిల్లా అధికారుల సంఘం తరఫున సిపిఓ జి రామారావు, జిల్లా పౌర సరఫరాల అధికారి కళ్యాణి, ఏపీ ఈపీడీసీఎల్, ఇతర జిల్లా అధికారులు, అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ ఏవో శ్రీనివాసరావు, ఎస్‌డిసీలు అనిత, జ్ఞానవేణి, డిపిఆర్‌ఓ సాయిబాబా, జిల్లా ఉద్యానవన అధికారి ప్రభాకర్ రావు, డిపిఓ శిరీష రాణి, ఎక్సైజ్ అండ్ ప్రోబిషన్ సూపరింటెండెంట్ వెంకటరమణ తదితరులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న జెసి జాహ్నవి

'మిషన్ వాత్సల్య' దరఖాస్తుకు తుది గడువు 26

ప్రజాశక్తి - యలమంచిలి

తల్లి, తండ్రి ఇద్దరిలో ఏ ఒకరు లేని 18 ఏళ్ల లోపు పిల్లల కోసం కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య పథకానికి ఈ నెల 15నుంచి 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని యలమంచిలి ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ ఇందిరాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లి వితంతువు, విడాకులు తీసుకున్న పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. వార్షిక ఆదాయం గ్రామాల్లో రూ.72,000, పట్టణాల్లో 96,000 మించరాదన్నారు. దీర్ఘవ్యాధులతో బతికున్న తల్లిదండ్రుల పిల్లలు కూడా అర్హులేనని పేర్కొన్నారు. సర్టిఫికెట్లు అన్నీ తీసుకువస్తే తామే దరఖాస్తును అప్‌లోడ్ చేస్తామని ఇందిరాదేవి తెలిపారు.

నేడు మజ్జిగ కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి -యలమంచిలి : ఈ నెల 14తేదీ అంబేద్కర్ జయంతి సందర్భంగా యలమంచిలి మున్సిపాల్టీలో నాలుగు మజ్జిగ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ తోట కృష్ణవేణి పేర్కొన్నారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. దిమిలి రోడ్డు, మున్సిపల్ కార్యాలయం, బస్టాండ్ మొదలైన చోట్ల వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ జానకమ్మ

ధ్రువపత్రాలు సకాలంలో ఇవ్వాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల వ్యాప్తంగా పలు సంక్షేమ పథకాల నిమిత్తం లబ్ధిదారులకు ధ్రువపత్రాలను సకాలంలో అందజేయాలని తహశీల్దారు జానకమ్మ సూచించారు. గురువారం గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల సర్వే నిర్వహించిన గ్రామాల్లో సర్వే రాళ్ళ ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాలలో పారదర్శకంగా గ్రామ సభలు నిర్వహించి రైతులకు తెలియపరచి రాళ్ళ ఏర్పాట్లు చేయాలని సూచించారు. గ్రామాల నుండి అక్రమంగా తరలిస్తున్న మట్టి, ఇసుక రవాణా పై దృష్టి సారించి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఉర్ధవరావు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలోని బోడపాలెం గ్రామంలో గురువారం సర్పంచ్ ఎరుకు నాయుడు ఉపాధి పనులు ప్రారంభించారు, రాజులుబాబు గుడి నుండి అల్లు రాజబాబు పొలం వరకు రోడ్డు పనులతో పాటుగా చెరువు పూడిక తీత పనులు ప్రారంభించారు. ఉపాధి కూలీలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సకాలంలో వేతనాలు అందించాలని సందర్భంగా ఆయన కోరారు.

పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

చెక్కు అందిస్తున్న కృష్ణ

రామాలయం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని ఎల్. పొన్నవోలు పంచాయతీ నర్సయ్యపేటలోని రామాలయం నిర్మాణానికి ఎం.కోడూరుకు చెందిన జన సేన నాయకులు రాయపురెడ్డి కృష్ణ రూ.20,116 విరాళం గురువారం అందించారు. గ్రామానికి చెందిన జన సేన కార్యకర్తల ఆహ్వానం మేరకు గ్రామానికి చేరుకుని చెక్కు రూపంలో విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

7న మోదకొండమ్మ పండగ

ప్రజాశక్తి -మాడుగుల:మే 7వ తేదీ ఆదివారం మండలంలోని ఎం.కోడూరు మోదకొండమ్మ పండగ నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు బుధవారం అమ్మవారి పాదాలు, ఘటాలు ఊరేగింపు నిర్వహించి సతకం పట్టు వద్ద కొలువు ఏర్పాటు చేశారు. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన నేతలు పడాల అప్పలనాయుడు, గొల్లవిల్లి రాజేష్, కలిమి గోసమ్మ, పడాల అప్పలరాజు, చింత మూర్తి, గంజి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఊరేగిస్తున్న భక్తులు

పోడు..పట్టాలకు సన్నద్ధం

- సర్వే పనులు పూర్తి- సాగు రైతుల్లో వెల్లువెత్తుతున్న సంతోషం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో పోడు భూములకు పట్టాల మంజూరు చేసేందుకు అధికారులు సర్వేలు పూర్తి చేయడంతో సాగులో ఉన్న రైతులలో సంతోషం వెలువెత్తుతోంది. సుమారుగా 20 సంవత్సరాల నుంచి పోడు భూములను సాగు చేసుకుంటున్న రైతులు పట్టాలు కావాలంటూ పలుమార్లు ఉన్నతాధికారులకు ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా అది కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వాలు మారుతున్నా పోడు భూముల సాగు చేసుకున్న రైతులకు మాత్రం పట్టాల మంజూరులో ముందుకు అడుగు వేయలేకపోయారు. ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అభ్యర్థన మేరకు ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీతో ఉన్నతాధికారుల సహకారంతో పట్టాల మంజూరుకు చర్యలు చేపట్టారు.

గ్రామాల వారీగా సర్వే

గొలుగొండ మండలంలో పోడు భూముల సర్వే కార్యక్రమం పూర్తయింది. మండలంలో 10 రెవెన్యూ గ్రామాల్లో ఫిబ్రవరి నెల ప్రారంభం నుంచి రెండు నెలల కాలంలో 345 మంది రైతులు సాగు చేస్తున్న 366.5 ఎకరాల్లో సర్వేయర్ల బృందంతో ఇన్చార్జి తహసిల్దార్ జి.ఆనంద్‌రావు నేతృత్వంలో సర్వే పనులు పూర్తి చేశారు. చోద్యం రెవెన్యూలో 179 మంది రైతులకు 190.44 ఎకరాలు, గాదంపాలెం రెవెన్యూలో 8 మంది రైతులకు 8.21 ఎకరాలు, పప్పుసెట్టిపాలెం రెవెన్యూలో 37 మంది రైతులకు 22.34 ఎకరాలు, నాగన్న దొరపాలెం రెవెన్యూలో పది మంది రైతులకు 9.57 ఎకరాలు, నల్లంకి రెవెన్యూలో 11 మంది రైతులకు 12.5 ఎకరాలు, అమ్మపేట రెవెన్యూలో 10 మంది రైతులకు 10.57 ఎకరాలు, కొత్త మల్లంపేట రెవెన్యూలో 19.81 ఎకరాలు, పొగచెట్లపాలెం రెవెన్యూలో 36.13 ఎకరాలు, పాకలపాడు రెవెన్యూలో 40 మంది రైతులకు 55.29 ఎకరాలు, కొమిర రెవెన్యూలో ఒక రైతుకు 1.63 ఎకరాల భూములను సర్వే చేసి రెవెన్యూ అధికారులు పట్టాల మంజూరుకు సిద్ధం చేశారు. లబ్ధిదారులందరికీ పట్టాలు మంజూరు చేయడానికి ఉన్నతాధికారులకు నివేదికలు కూడా పంపించారు. పట్టాల మంజూరు త్వరలోనే జరుగుతుందని ఉన్నతాధికారులు తెలియజేసినట్లు ఇన్చార్జి తహసిల్దార్ తెలిపారు.

చోద్యంలో రైతుల సాగులో ఉన్న పోడు భూములు

సిఎం సహకారంతో మంజూరు

గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని రైతుల అందించిన వినతుల మేరకు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. ఆయన సానుకూలంగా స్పందించి అనుమతులు మంజూరు చేయడంతో ఉన్నతాధికారుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సర్వేలు పూర్తయ్యాయి. త్వరలోనే సాగు చేసుకుంటున్న రైతులందరికీ భూపట్టాలు మంజూరు చేస్తాం.

పెట్ల ఉమా శంకర్ గణేష్, ఎమ్మెల్యే, నర్సీపట్నం

365.5 ఎకరాలు అందించేందుకు చర్యలు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోడు భూముల పట్టాల మంజూరుకు 10 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేశాము. 10 రెవెన్యూ గ్రామాల్లోనూ 340 మంది రైతులకు 365.5 ఎకరాల భూమిని అందించడానికి అన్ని పనులు పూర్తి చేసి నివేదికలను ఉన్నతాధికారులకు పంపించడం జరిగింది. ఇటీవల సుమారు 20 మంది రైతులు పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. రెండవ దశలో సర్వేలు నిర్వహించి పట్టాలు మంజూరు చేస్తాం. ఇంకా పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులు తమ దృష్టికి తీసుకురావాలి.

జి.ఆనంద్ రావు, ఇన్చార్జి తహశీల్దార్

పాస్ పుస్తకాలు ఇస్తే ప్రోత్సాహకాలు

20 సంవత్సరాలుగా భూములను సాగు చేసుకుంటున్నాం. భూ పట్టాల కోసం చాలాసార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను అడగడం జరిగింది. ఇప్పటి వరకు పట్టాదారు పాసు పుస్తకాలు లేక పోవడంతో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు దూరమయ్యాము. బ్యాంక్ రుణాలకి నోచుకోలేక పోయాం. సాగు చేస్తున్న భూములకు పట్టాలిస్తామని అధికారులు వచ్చి సర్వేలు చేశారు. పాస్ పుస్తకాలు మంజూరుతో ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందే అవకాశం ఉంటుంది.

టెంకా ధర్మరాజు, పోడుభూమి సాగురైతు, చోద్యం

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

గ్రామీణ నీటి సరఫరా అధికారి కరుణ

ప్రజాశక్తి -కోటవురట్ల: జల్ జీవన్ మిషన్ పనుల్లో భాగంగా పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామాల్లో వాటర్ ట్యాంకర్ నిర్మాణం చేపడుతున్నట్లు గ్రామీణ నీటి సరఫరాధికారి కరుణ తెలిపారు. సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఇప్పటికే వివిధ గ్రామాల్లో పైపులైను పనులు పూర్తికాక ట్యాంక్ నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. పొందూరు గ్రామంలో 20 వేల లీటర్ల ట్యాంకు పనులు పూర్తి కాగా ఇప్పటికే మొదలైన గ్రామాలు కొడవటిపూడి 40 వేల లీటర్లు, నీలి గుంట 20, కైలాస పట్నం 60, తిమ్మాపురం 20 కాగా మొదలు కావలసిన గ్రామాలు రామన్నపాలెం 40, రత్నాల పాలెం 90, ఆక్సాహెబ్ పేట 20, కె.బి అగ్రహారం 10 వేల లీటర్లు, చొప్పున ట్యాంకులు నిర్మాణం మొదలు పెట్టాల్సి ఉందన్నారు. అదేవిధంగా గవరపేటలో 10, కోటవురట్ల 40, బికేపల్లి 40, మునగలపాలెం 10, గూడెపు లోవ 10, అనుకు 10, రామచంద్రపాలెం 20, పి గొట్టువాడ 60, చిన్న బొడ్డేపల్లి 10, ఆర్ కొత్తూరు 10, జి ఎస్ ఆర్ పాలెం 10, కే కొత్తూరు 10, వేల లీటర్ల ట్యాంకుల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా నూకాలతల్లి పండగ

ప్రజాశక్తి -రోలుగుంట:మండలంలో ఎంకె. పట్నం గ్రామంలో గురువారం నూకాలతల్లి పండుగ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మిగతా గ్రామాల్లో కొత్త అమావాస్యకు ఈ పండుగ నిర్వహిస్తారు. ఈ గ్రామంలో ప్రతి ఏడాది గంధామావాస్యలో నిర్వహిస్తారు.భక్తులు అమ్మవారికి పండ్లు, చీరలు సమర్పించారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో ఏర్పాటు చేసిన సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీవో సీతారామరాజు, ఈఓపిఆర్డి వెంకటనారాయణ గురువారం పరిశీలించారు. వర్మీ కంపోస్ట్ తయారీ, చెత్త నిర్వహణ తదితర అంశాలను పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. నక్కపల్లి గ్రామాన్ని చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు. దీంతో వ్యాధులు ప్రబల కుండా ఉంటాయని తెలిపారు. నక్కపల్లి సంపద తయారీ కేంద్రంలో పలు పంచాయతీలకు ఇస్తున్న శిక్షణ పక్కాగా అమలు జరిగే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

17న కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :ఈ నెల 17న స్థానిక శ్రీలలితా నర్సింగ్ హోమ్ లో ఉచిత రొమ్ము కేన్సర్ స్క్రీనింగ్ నిర్వహిస్తామని స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ శ్రీదేవి గురువారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 40 సంవత్సరాల వయసు దాటిన వారు రొమ్ములో గడ్డలు ఉన్నట్టు అనిపిస్తే తప్పకుండా రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్ష చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు ఫోన్:9618551521 సంప్రదించాలన్నారు.

సర్వే రాళ్లు ఏర్పాటు

ప్రజాశక్తి -గొలుగొండ:రీ సర్వే చేసిన భూములకు సరిహద్దుల్లో సర్వే రాళ్లు ఏర్పాటు చేస్తున్నామని గొలుగొండ ఇన్చార్జ్ తహశీల్దార్ జి.ఆనందరావు అన్నారు. గురువారం కొత్తపాలెం రెవెన్యూ భూముల్లో రీ సర్వే అనంతరం సరిహద్దుల్లో ఆయన సిబ్బందితో సర్వే రాళ్లు పాతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే పనులు పూర్తయిన అన్ని రెవెన్యూ గ్రామాల్లోనూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే రాళ్లు ఏర్పాట్లు చేస్తామన్నారు. మండలంలో ముందుగా కొత్తపాలెం రెవెన్యూలో 29 ఎకరాల భూములకు 48 సర్వే రాళ్ళను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. రీసర్వే పనులు పూర్తయిన మిగిలిన రెవెన్యూ గ్రామాల్లో కూడా త్వరలోనే సరిహద్దులలో సర్వే రాళ్లను ఏర్పాటు చేస్తామని ఆయనన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిటి బాలరాజుదొర, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సచివాలయ సర్వేయర్లు శివ, కోమలి పాల్గొన్నారు.

రాళ్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ప్రైవేటు బస్సు అడ్డగింత

ప్రైవేట్ వాహనదారులతో మాట్లాడుతున్న డిపో మేనేజర్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న పెట్రోలు బంకు వద్ద పాసింజర్లను ఎక్కించుకొని కదలడానికి సిద్ధంగా ఉన్న ఒక ప్రైవేటు బస్సును ఆర్టీసీ డిపో మేనేజర్ ధీరజ్ గురువారం అడ్డుకున్నారు. బస్సు ముందు కుర్చీ వేసుకుని కూర్చుని బస్సును అడ్డుకున్న వైనం ఆశ్చర్యాన్ని కలిగించింది. కొద్దిసేపు ప్రైవేట్ ఆపరేటర్లకు, డిపో మేనేజర్‌కు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్ స్టేషన్ కు రెండు కిలోమీటర్ల దూరం వరకు ప్రైవేట్ ఆపరేటర్లు పాసింజర్లను ఎక్కించుకోరాదని మేనేజర్ వాదించారు. ఎట్టకేలకు ప్రైవేటు బస్సు వెనుకకు తీయడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ, నర్సీపట్నం ప్రాంతంలో ప్రైవేటు వాహనాలు అధికంగా తిరుగుతున్నాయని, వాటితో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందన్నారు. ప్రైవేటు బస్సులకు కాంట్రాక్ట్ క్యారేజ్ పర్మిట్ ఉంటుందని, దానిని అనుసరించి శుభకార్యాలు తదితర ప్రత్యేక కార్యక్రమాలకు మాత్రమే పాసింజర్లను తరలించే వీలుందని తెలిపారు. ప్రతి స్టేజీలో ఆపి ప్యాసింజర్లను ఎక్కించుకునే వీలు లేదన్నారు. ఆర్టీసీకి స్టేజ్ క్యారేజ్ పర్మిట్ ఉంటుందని తెలిపారు.కాంట్రాక్టు క్యారేజ్ పర్మిట్‌తో స్టేజ్ క్యారేజ్ గా వాహనాలను నడపడం చట్ట విరుద్ధమన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రైవేటు బస్సును అడ్డుకున్నామన్నారు. ఈ విధంగా వాహనాలు నడిపతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్టీసీ డిపో ఎస్ఎం జిపి రావు, జనరల్ ఏడివి పీవీఎస్ఎన్ రావు, అసిస్టెంట్ మేనేజర్ నాయుడు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ జిజి రావు, నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆర్ఎన్ రాజు, డిపో కార్యదర్శి జిఎస్ నారాయణ, సూపర్వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు అకౌంట్లకు పాట్లు

-లబ్ధిదారులకు తప్పని అవస్థలు -గంటల తరబడి నిరీక్షణ

ప్రజాశక్తి -కోటవురట్ల:ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మిషన్ వాత్సల్య పథకం నమోదుకు లబ్ధిదారులతో పాటు సంరక్షకునికి బ్యాంక్ అకౌంట్ తప్పనిసరి కావడంతో మండలం వ్యాప్తంగా గల బ్యాంకులన్నీ తీవ్ర రద్దీతో దర్శనమిస్తున్నాయి. మిషన్ వాత్సల్య పథకం గడువు తేదీ సమీపి స్తుండటంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు అకౌంటు నిమిత్తం ఒక్కొక్కరి పేరున రూ.1000 నుంచి 2000 వరకు డిపాజిట్ చేయాలని మండలంలో కొన్ని బ్యాంకులు డిమాండ్ చేస్తున్నట్లు వాపోతున్నారు. అదేవిధంగా వారం రోజుల నుండి బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా అకౌంట్లు పుస్తకాలు రాలేదని, దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు.

ఈ విషయమై కోటవురట్ల స్టేట్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ ప్రశాంతిని వివరణ కోరగా లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా త్వరితగతిన బ్యాంకు అకౌంట్లకు మినీ బ్యాంకుల ద్వారా కూడా సేవలు అందిస్తున్నామన్నారు. రోజుకు 15 మందికి మాత్రమే అవుతుండడం పట్ల కాస్త ఇబ్బందిగా ఉన్న మాట వాస్తవమే అన్నారు. ఇటీవల సెలవులు అధికంగా ఉండడంతో ఖాతాదారులతో కాస్త రద్దీగా ఉన్నామని పేర్కొన్నారు.

బ్యాంకులో వేచివున్న లబ్ధిదారులు

భూసార పరీక్షలు చేసుకోవాలి

ప్రజాశక్తి -నక్కపల్లి :రైతులు భూసార పరీక్షలు చేయించుకొని, దానికి అనుగుణంగా ఎరువులను వినియోగించాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ అన్నారు. మండలంలోని దేవవరం గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద ఆర్‌బికే సిబ్బందికి భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి మట్టి నమూనాలు తీసే విధానంపై వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, మొక్కల పెరుగుదలకు 16 రకాల పోషక పదార్థములు అవసరమని, మోతాదుకు మించి పోషకాలు వాడితే పంట దిగుబడి తగ్గి, ఆదాయం తగ్గుతుందన్నారు. అధికంగా ఎరువులు వాడటంతో ఖర్చు కూడా ఎక్కువ అవుతుందన్నారు. మట్టి నమూనాలు సేకరించే టప్పుడు నేల రంగును, రకాన్ని బట్టి మెరక, పల్లాలను అనుసరించి మట్టి నమూనాను సేకరించాలని సిబ్బందికి సూచించారు

అవగాహన కల్పిస్తున్న ఉమాప్రసాద్

పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం

సర్వే రాళ్ల ఏర్పాటుపై అప్రమత్తం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల వ్యాప్తంగా ఇటీవల జరిగిన వివిధ గ్రామాలలో సర్వే రాళ్ళ ఏర్పాటు పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ డివిజనల్ అధికారి జయరాం సూచించారు. గురువారం సాయంత్రం ఆయన రాజపేట గ్రామంలో సర్వే రాళ్ల ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్ వ్యాప్తంగా 140 గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామని, ఇప్పటికే సర్వే పూర్తయిన 33 గ్రామాల్లో సర్వే రాళ్ళు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎటువంటి వివాదాలకు చోటు లేకుండా ముందస్తుగా రైతులకు సమాచారం అందజేసి ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

497వ రోజుకు ధర్నా

ప్రజాశక్తి -నక్కపల్లి:హెటిరో మందుల కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైన్‌కు సంబంధించి తమకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకార నాయకులు స్పష్టం చేశారు .పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 497వ రోజుకు చేరింది. గురువారం శిబిరం వద్ద మత్స్యకారులు పైప్ లైన్ కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ, చేపలు వేట తప్ప తమకు మరో ఉపాధి లేదని, సముద్రాన్ని కలుషితం చేసి పొట్ట కొట్టొద్దన్నారు. ఇప్పటికే ఉన్న పైప్ లైన్‌తో కంపెనీ వ్యర్థ జలాలు సముద్రంలోకి విడిచి పెట్టడంతో ఈ ప్రాంతంలో మత్స్య సంపద నశించి పోయిందన్నారు.కొత్తగా పైపులైన్ ఏర్పాటు చేస్తే తమ మునుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆవేదన వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు గోసల స్వామి, కోడ కాశీరావు, కోత్వాల కాశీ, పిక్కి గంగరాజు, బొంది నూకరాజు, పిక్కి రాజు, చొడిపల్లి రాజు, మైలపల్లి వెంకటేష్, మైలపల్లి శివాజీ, పిక్కి రాజు, మైలపల్లి బాపూజీ, మైలపల్లి జాను, మైలపల్లి బైరాగి రాజు, పిక్కి సత్తి రాజు పాల్గొన్నారు.

మండల సమావేశానికి అధికారుల గైర్హాజరుపై..

సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి -రావికమతం: రావికమతం మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపీ పైలా రాజు అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పలువురు ఎంపిటీసీలు, సర్పంచులు, కోపరేటివ్ సొసైటీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ సభ్యులు, అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశానికి పలువురు మండల స్థాయి అధికారులు డుమ్మా కొట్టడంపై సభ్యులు పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుపాక సచివాలయ పరిధిలో ఐదు శివారు గ్రామాలకు వైద్యం అందటం లేదని ఆయా గ్రామాలకు కూడా 104 వైద్యులతో కూడిన శిబిరాన్ని ఏర్పాటు చేయాలని ఎంపిటీసీ ముచ్చ సూర్యనారాయణ సభ దృష్టికి తీసుకొచ్చారు. మిషన్ వాత్సల్య పథకానికి ఒంటరి మహిళగా జీవిస్తున్న వారికి విడాకులు పత్రాలు ఇప్పుడు కావాలంటే ఏ రకంగా తెచ్చుకోవాని కొత్తకోట ఎంపిటీసీ పూడి దేవా సభ దృష్టికి తెచ్చారు. కళ్యాణపులోవ రిజర్వాయర్ కాలవ గండి పడితే దానిని నేటికీ పూడ్చక పోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఇరిగేషన్ అధికారిపై టి అర్జాపురం సర్పంచ్ మడగల పాల్గున తెలిపారు.. మండలంలో పలు గ్రామాలలో నీటి ఎద్దడి నెలకొందని, దానికి తగు చర్యలు చేపట్టాలని పలువురు తెలిపారు. చేతి పంపు బోర్లకు కావలసిన విడి పరికరాలను గ్రామపంచాయతీల నుంచి కొనుక్కోవడానికి అనుమతులు ఇవ్వక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చీమలపాడు సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ముక్కా మహాలక్ష్మి నాయుడు, వైస్ ఎంపిపీలు దంట్ల రమణ, భవాని ప్రసాద్, ఎంపీడీవో వెంకన్న బాబు, తహశీల్దారు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

మాట్లాడుతున్న ఎంపిడిఒ

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-గొలుగొండ:వేసవి దృష్ట్యా ఉపాధి కూలీలు పనులకు వేగంగా రావాలని ఎంపిడిఒ డేవిడ్‌రాజు సూచించారు. మండలంలో గురువారం కొత్తమల్లంపేట రెవెన్యూలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడారు. పనులపై ఫిల్డ్ అసిస్టెంట్ వి.బాబ్జిని అడిగి తెలుసుకున్నారు. జాబ్‌కార్డులో పేరున్న ప్రతీ ఒక్కరూ పనిలోకి రావాలన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో పప్పుశెట్టిపాలెం నుంచి వెంకటాపురంకు చేపడుతున్న రోడ్డు పనులను ప్రాజెక్టు జేఈ సత్యనారాయణ గురువారం పరిశీలించారు. అనంతరం కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. పనులు వేగవంతం చేయడంతో పాటు నాణ్యతను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, సర్పంచ్ పత్తి రమణ, పాకలపాడు వైసిపి నాయకులు యాళ్ల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న జఇ

ఎస్ఐకి అభినందనలు

ఎస్ఐని అభినందిస్తున్న నేతలు

ప్రజాశక్తి-గొలుగొండ:కృష్ణదేవిపేట నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఉపేంద్రను లింగంపేట, గింజర్తి టీడీపీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగందొరపాలెం మాజీ సర్పంచ్ గెడ్డం సత్యనారాయణ, లింగంపేట గ్రామ కమిటీ అధ్యక్షులు మరిసా వెంకటరమణ, మిడతాన సూరిబాబు, గొంతిన తాతాజీ, ముచ్చకర్ల నర్సింగరావు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని కాగిత ఊర చెరువును అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. గురువారం సర్పంచ్ రాజేష్, ఈఓపిఆర్ డి వెంకటనారాయణతో కలిసి చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. ఊర చెరువు సుందరీకరణ చేపట్టడానికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేరకు చెరువు అభివృద్ధి పనులు పై చర్చించారు. చెరువు ప్రాంతమంతా ఆహ్లాదకరంగా తీర్చి దిద్దనునన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహారాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తేజ కేంద్రాలు.. అంబేద్కర్ భవనాలు

◆ విశాఖ నగరంలో విశేష సేవలు ◆ పోరాట వేదికలుగా విగ్రహ ప్రాంతాలు

ప్రజాశక్తి-విశాఖపట్నం

నవ భారత రాజ్యాంగ నిర్మాత, భారత ప్రజల స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు ఉన్న క్రేజ్ గురించి పరిచయం చేయనక్కర్లేదు. ఈ మహోన్నత వ్యక్తి జయంతి, వర్థంతి కార్యక్రమాలను దేశ ప్రజలు ఏటా ఎంతో ఆనందంగా వేడుకగా జరుపుకుంటున్నారు. ఇంతటి మహోన్నతుడైన అంబేద్కర్ విగ్రహాలు పలుచోట్ల ఉద్యమాలకు వేదికలుగా నిలుస్తుంటే, అనేక నగరాలలో వలే విశాఖ నగరంలో కూడా అంబేద్కర్ పేరిట నిర్మించిన సమావేశ మందిరాలు, కల్యాణ మండపాలు, సామాజిక భవనాలు ప్రజల సామాజిక అవసరాలను తీర్చటంలో దోహదపడు తున్నాయి. 'నగరంలో 'అంబేద్కర్' పేరిట నిర్మించిన పలు కట్టడాలు.. ఆయన విగ్రహాల గురించి చెప్పాలంటే చాంతాడంత జాబితా రూపొందుతుంది. నగరంలోని ఎల్ఐసి భవనం సమీపంలో అంబేద్కర్ నిలువెత్తు విగ్రహం నగరవాసులకు ఉద్యమ కేంద్రం. ముఖ్యంగా దళితులు, అణగారిన ప్రజలు, తమకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తేవడానికి ఇక్కడి అంబేద్కర్ విగ్రహాన్నే వేదికగా చేసుకుంటారంటే అతిశయోక్తి కాదు. అంబేద్కర్ సర్కిల్‌గా పేరున్న ఈ ప్రదేశాన్ని గతేడాది అందంగా తీర్చిదిద్దారు. వందలాది వాహనాలు ఈ సర్కిల్ ద్వారా నడుస్తూ ఉంటాయి.

విద్యల నిలయం ఆంధ్రా విశ్వవిద్యాలయంలోని అంబేద్కర్ విగ్రహం విద్యార్థుల ఉద్యమ కేంద్రం అని చెప్పవచ్చు. విద్యార్థులు తమకు అన్యాయం జరిగిందని ఎయు అధికారులు, ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఈ విగ్రహాన్నే ఉద్యమ కేంద్రంగా మలుచుకుంటారు. జాతీయ రహదారిలో ఎన్ఎడి కొత్త రోడ్డు జంక్షన్, బిర్లా కూడలి, 37వ వార్డులోని రామ్‌జీ స్టేట్, 23వ వార్డు రెల్లివీధి జంక్షన్, అల్లిపురం జివిఎంసి పాఠశాల ప్రాంతం, తాటిచెట్ల పాలెం, నెహ్రూ బజార్ ఇలా నగరంలో పలు

ప్రాంతాల్లో అంబేద్కర్ విగ్రహాలు ఆకర్షణీయంగా, దళితుల పాలిట ఆశాజ్యోతిగా విరాజిల్లుతున్నాయి.

అంబేద్కర్ పేరుతో ఉన్న పలు భవనాలు, కల్యాణ మండపాలు, సామాజిక భవనాలు నగరంలో ఎన్నో ఉన్నాయి. వీటిలో రామాటాకీసు నుంచి సత్యం జంక్షన్‌కు వెళ్లే మార్గంలోని బుల్లయ్య కాలేజీని ఆనుకొని ఉన్న అంబేద్కర్ భవనం ప్రసిద్ధిగాంచినది. విశాలమైన స్థలంలో అతిపెద్ద సైజులో అన్ని సదుపాయాలతో నిర్మించిన ఈ భవనంలో నిత్యం ఏదో ఒక సామాజిక కార్యక్రమం, వివాహాలు వంటి శుభకార్యాలు, సభలు, సమావేశాలు జరుగుతూనే ఉంటాయి. ఇక్కడ అంబేద్కర్ పేరిట ఒక గ్రంథాలయం ఏర్పాటు చేశారు. పౌర గ్రంథాలయం తరహాలో అంబేద్కర్ గ్రంథాలయంలో చిన్నపాటి సభలు, సమావేశాల ఏర్పాటుకు వీలుంది.

ఆంధ్రా యూనివర్శిటీలో కూడా అంబేద్కర్ పేరిట రెండు అసెంబ్లీ హాళ్లున్నాయి. సిరిపురం జంక్షన్‌కు సమీపంలో పెట్రోలు బంకుకు ఎదురుగా ఉన్న ఒక హాలులో కనీసం 2 వేల మంది కూర్చోటానికి వీలుగా సీటింగ్ ఉంది. వాహనాల పార్కింగ్‌తో సహా అన్ని సౌకర్యాలు ఉండడంతో తరచూ సామాజిక కార్యక్రమాలు శుభకార్యాలు ఇక్కడ జరుగుతుంటాయి. ఎయు లోపలి భాగంలో కూడా అంబేద్కర్ పేరిట మరొక హాలులో అధికంగా సాహిత్య కార్యక్రమాలు, విద్యార్థుల ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తారు. అంబేద్కర్ పేరిట జివిఎంసి 23వ వార్డులో కల్యాణ మండపం నిర్మించింది. 27వ వార్డులో కూడా అంబేద్కర్ పేరిట మరొక కల్యాణ మండపాన్ని జివిఎంసి నిర్మించింది. వీటితోపాటు పలు వార్డుల్లో అంబేద్కర్ పేరిట సామాజిక భవనాలను జివిఎంసి నిర్మించింది. ఇవన్నీ కూడా ఆయా ప్రాంతాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఇలా ఉపయోగించుకున్న భవనాలు, కల్యాణ మండపాలు, సామాజిక భవనాల్లో కొన్ని శిథిలావస్థకు చేరాయి.